సంచిక 3 - సెప్టెంబర్ 2018

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా
**సంచిక 3, సెప్టెంబర్ 2018**

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.

**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**
నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు - 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email : leisaindia@yahoo.co.in

**లీసా ఇండియా** ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు.

**చీఫ్ ఎడిటర్** కె.వి.యస్. ప్రసాద్

**మేనేజింగ్ ఎడిటర్** టి.యమ్. రాధ

**అనువాదం** రామ శేషు సూరంపూడి

**అనువాద సమన్వయం** వీణ మార్కాండే

**అడ్మినిస్ట్రేషన్** రుక్మిణి జి. జి.

**డిజైన్ లేఔట్** శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్

**ముద్రణ** స్పాన్ ప్రింట్, బెంగళూరు

**కవర్ ఫోటో** ఒడిశాలోని కోంద్ తెగల వారు సంప్రదాయ పద్ధతిలో చిరుధాన్యాలను శుద్ధి చేస్తున్న దృశ్యం.

**ఫోటో**

## లీసా మేగజైన్
**ఇతర ఎడిషన్లు**
లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్, బ్రెజిలియన్ మరియు ఈస్ట్ ఆఫ్రికన్ ఎడిషన్

## లీసా ఇండియా మేగజైన్
**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**
హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ

ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.

మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం

## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను వరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.

ధర్మకర్తలు
చైర్మన్ : శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్
సభ్యులు : డా. విఠల్ రాజన్, డా. ఎం. మహదేవప్ప, డా. ఎన్. జి. హెగ్డే, డా. టి.ఎం. త్యాగరాజన్, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎ. రాజన్న, డా. వెంకటేష్ తగత్, డా. స్మిత ప్రేమ్‌చందర్
కోశాధికారి : శ్రీ బి.కె. శివరాం
ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ : శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్

## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్ధిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులకు,

చిరుధాన్యాలు, పశుపోషణ, వాటిలోని వైవిధ్యాల గురించిన ప్రాముఖ్యతలను వివరించే అంశాలను ఈ సంచికలో మీ ముందు ఉంచుతున్నందుకు లీసా ఇండియా ఆనందిస్తున్నది.

చిరుధాన్యాలలో పోషక విలువలు హెచ్చు మోతాదులో లభిస్తాయి. పోషకాహార లోపం వల్ల ఎదురవుతున్న సమస్యలకు, పేద ప్రజల ఆకలి బాధలకు చిరుధాన్యాలే సరైన పరిష్కారం చూపిస్తాయి. ఇందుకోసం సేద్య విధానాలలో కొన్ని మార్పులు చేయడం అవసరం. కొన్ని సర్దుబాట్లు కూడా అవసరం. ఈ విషయాలను గుర్తించిన ఔత్సాహిక రైతన్నలు తమ సాగు విధానాల్లో అనుసరించిన కొత్త కొత్త ఆలోచనలు, చేపట్టిన పద్ధతుల ప్రభావం వల్ల ఆహార భద్రత సాకారమవుతోంది. అనిశ్చిత వాతావరణ మార్పులను తట్టుకోగలిగే విధానాలు అనుసరించడం వారి ప్రత్యేకత. వారు అనుసరించిన విధానాలు అన్ని సవాళ్లను దీటుగా ఎదుర్కోగలిగాయి.వాతావరణంలో వచ్చే అన్ని రకాలైన సవాళ్లను తట్టుకుని నిలిచాయి. శెట్టి ఇంకా అలాంటి ఇతర ఔత్సాహిక రైతులకు చిరుధాన్యాల సాగును చేపట్టే విషయంలో స్వయం శక్తి అగ్రి ఫౌండేషన్ అన్ని విధాలుగా ప్రోత్సాహం ఇచ్చింది. వారి సామర్ధ్యాలను మెరుగుపరిచింది. వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేందుకు అండగా నిలిచింది. ఇలాంటి వినూత్న విధానాలకు వ్యవస్థపరంగా, ప్రభుత్వ విధానాల పరంగా సహాయసహకారాలు అవసరం.

పశుపోషణ మన దేశంలో మనకు తరతరాలుగా సంక్రమించిన వారసత్వ సంపద అని చెప్పాలి. దేశీయ పశుజాతులలో ఎన్నో రకాలు, వైవిధ్యాలు ఉన్నాయి. అందులోనే క్లిష్ట సమయాల్లో నష్ట నివారణకు తోడ్పడే ఎన్నో అంశాలు జతకూడి ఉండటం మన పశు సంపదకున్న ప్రత్యేకత. ఆర్ధిక పరంగా కూడా దేశీయ పశుజాతులు లాభసాటిగా, ప్రయోజనకరంగా ఉంటాయనేది పరమ సత్యం. సంప్రదాయంగా పశుపోషణకు మన దేశంలో అనుసరిస్తున్న విధానాలు వ్యవస్థీకృతంగా నిలిచిపోయాయి. పశు పోషకులు, పశువులకు అవసరమైన మేత పండించే రైతన్నలు గ్రామీణ ప్రాంతాలలో కొన్ని శతాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాలు అవి. పశు జాతులలో వైవిధ్యాలను లీసా ఇండియా ఈ సంచికలో వివరిస్తోంది.

మీ అనుభవాలు, ప్రోత్సాహం కోసం మేము నిరంతరం ఎదురుచూస్తూ ఉంటాము. మీకు సన్నిహితులైన తోటి రైతన్నలకు ఈ మన మ్యాగజైన్ అందించాలనే ఆసక్తి మీకు ఉంటే వారి పూర్తి చిరునామా మాకు పంపించండి. మేము వారికి సంతోషంగా మ్యాగజైన్ అందించగలం.

సంపాదకులు




**చిరు ధాన్యాలు - విధానాల్లో ......రంజిత్ కె.సాహూ, రవి శంకర్.., శ్రీనివాస్ దాస్**

చిరు ధాన్యాలలో పోషక విలువలు సమృద్ధిగా ఉన్నాయి. ఆకలి కేకలు, పోషకాహార లోపం వంటి సమస్యలకు చిరుధాన్యాలే సరైన పరిష్కారం చూపిస్తాయి. అయితే వివిధ ప్రాంతాలలో పోషకాహారం అందజేసేందుకు ప్రభుత్వం ... తక్షణ అవసరం.

**4**



**సేద్య రంగంలో సంస్కరణలు ........................................... సురేష్ కన్నా కె**

సేద్య విధానాలలో సమూలమైన మార్పులు చేపట్టి సరికొత్త రూపం అందించగలిగితే వ్యవసాయ రంగంలో వినూత్న పురోభివృద్ధికి రైతు సోదరులు బాటలు వేయగలుగుతారు. అప్పుడే పెను సవాలుగా మారిన వాతావరణ ... అత్యవసరం.

**9**

**పశు పోషణ - స్వదేశీ సంప్రదాయం .................................................................................కమల్ కిషోర్**

పశు పోషణలో మన దేశానికి ఒక ప్రత్యేకత ఉంది. దేశంలోనే పుట్టి పెరిగి దేశీయ పశు సంపదలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న పశువుల జాతులు లెక్కకి మించి ఉన్నాయి. పశు జాతుల్లోని వైవిధ్యమే సమస్యకు పరిష్కారంగా చెప్పాలి. అధికోత్పత్తి కోసం సంకర జాతుల... నిర్వహణ పరంగా కొత్త సమస్యల్లోకి నెట్టివేస్తుంది.

**11**



**దక్షిణభారత మహిళా పోషకులు .......ఇల్సేకొహ్లెర్ - రాల్లెఫ్సన్ మరియు కే శివసేనాపతి**

దక్షిణభారతదేశంలోని మహిళలకు, స్థానికజాతి పశువులు పెంపకం సుళువుగా ఉండి వారికి కొంత అదనపు ఆదాయాన్ని సమకూరుస్తుంది. పశువుల పోషణ రోజులో కొద్దిసేపు చేసే పని కాబట్టి వారు ....రచయితలు కనుగొన్నారు.

**15**



**చిరుధాన్యాలు - ఓ పారిశ్రామికుడు...................................అమిత్ చక్రవర్తి**

వినియోగదారుల్లో చైతన్యం లేకపోవడం, సరైన గిరాకీ లోపించడం, వాటి విలువలను తెలియజేసే ప్రచార ఆర్భాలాలు కొరతగా ఉండడం, పరిశోధక శాస్త్రవేత్తలు, వాణిజ్య ప్రముఖుల ఉదాశీనత... ప్రస్తుతం ... సిద్ధమవుతున్నారు.

**18**

# చిరుధాన్యాలు - విధానాల్లో మార్పులు - పరిశీలన

## రంజిత్ కె.సాహూ, రవి శంకర్ బెహరా, శ్రీనివాస్ దాస్

**చిరు ధాన్యాలలో పోషక విలువలు సమృద్ధిగా ఉన్నాయి. ఆకలి కేకలు, పోషకాహార లోపం వంటి సమస్యలకు చిరుధాన్యాలే సరైన పరిష్కారం చూపిస్తాయి. అయితే వివిధ ప్రాంతాలలో పోషకాహారం అందజేసేందుకు ప్రభుత్వం రూపొందించిన విధానాలు పరోక్షంగా ఏక పంటల సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా జీవవైవిధ్యం దారుణంగా దెబ్బతింటున్నది. ఇది మరో రకమైన పోషక విలువల లోపానికి కారణమవుతోంది. అందువల్ల పర్యావరణ అనుకూల వ్యవసాయానికి తోడ్పడే విధంగా సంప్రదాయక పద్ధతుల్లోనే చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, అందుకు అనువైన విధానాలు రూపొందించి అమలులోకి తీసుకురావటం తక్షణ అవసరం.**

పేద ప్రజల ఆకలి తీర్చడంలోనూ, వారికి సమగ్రమైన పోషకాలను అందించడంలో చిరుధాన్యాలు సాటిలేదనేది అందరికీ తెలిసినదే. సామాన్య ప్రజానీకానికి ఎన్నో తరాలుగా ఆహార భద్రత కల్పించడంలో చిరుధాన్యాలు కీలకమైనవిగా గుర్తింపు పొందాయి. ముఖ్యంగా మన దేశంలోని గిరిజన ప్రాంతాలలోనూ, అంతగా అభివృద్ధి చెందని అనేక పేద దేశాల్లోనూ కూడా ఈ చిరుధాన్యాలను పేద ప్రజల పౌష్టికాహారంగా పేరు సంపాదించుకున్నాయి. అయితే ఇంతటి ప్రాముఖ్యం ఉన్న చిరుధాన్యాల విషయంలో ఒక పద్ధతి ప్రకారం నిర్లక్ష్యం ఏర్పడింది. ఫలితంగా వాటి ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నది.

కొద్ది సంవత్సరాల క్రితం వరకూ, అంటే 20-25 ఏండ్ల క్రితం వరకూ దేశంలోని అనేక ప్రాంతాలలో చిరుధాన్యాల సాగు విస్తృతంగా జరిగేది. ప్రత్యేకించి గిరిజన రైతన్నలు ఎక్కువగా నివసించే తూర్పు కనుమల సమీపంలోనూ, కోరాపూట్ జిల్లాలోనూ వీటి సాగు చాలా ఎక్కువగా ఉండేది. వారు సాగు చేసే పంటల్లో వివిధ రకాలైన జొన్నలు (సార్గం వల్గరే, పెరల్ మిల్లెట్స్, ప్రోసో మిల్లెట్స్, బార్న్‌యార్డ్ మిల్లెట్స్ (ఊదలు), ఫాక్స్‌టెయిల్ మిల్లెట్స్ (కొర్రలు), కోడో మిల్లెట్ (అరికలు), రాగులు వంటివి ముఖ్యమైనవి. వీటిలో ఎక్కువ విస్తీర్ణంలో అత్యధికంగా రాగి సాగు జరిగేది. ముఖ్యంగా భూసారం క్షీణించి, నీటి తేమను కొద్దిగా మాత్రమే నిలబెట్టుకునే స్వభావం ఉన్న భూముల్లో చిరుధాన్యాలు ఎక్కువగా పండించేవారు. అయితే ఈ పంటల సాగు పూర్తిగా వర్షాధారితం. కొండ ప్రాంతాల్లోనూ, మెట్ట ప్రాంతాల్లోను ఓ మోస్తరు భూసారం ఉన్న భూములలోనూ గిరిజన తెగలు ప్రధానంగా పోడు సేద్యం చేస్తుంటారు. సాధారణంగా జూన్, సెప్టెంబర్ మాసాల్లో వీరికి అనువైన సాగుకాలం ఉంటుంది. మిల్లెట్స్ సాగు ఈ గిరిజన సంతతి ప్రజలకు చాలా ముఖ్యమైన పోషకాహారం. హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (పోషకాహార అధ్యయన కేంద్రం) అధ్యయనం ప్రకారం కూడా బియ్యంతో పోలిస్తే ఈ చిరుధాన్యాలలోనే ఎక్కువ పోషకాలు (మినరల్స్), ప్రోటీన్లు, కొవ్వు పదార్థాలు ఉంటాయని తేలింది. అంతేకాకుండా ఈ రకం ధాన్యాలలో ఉన్న ఐరన్ పోషకం పోషకాహార లోపాన్ని, రక్తహీనతను నివారించడంలో చాలా

టేబుల్-1. చిరుధాన్యాల సాగు నుంచి యూకలిప్టస్ సాగులోకి మారిన విస్తీర్ణం వివరాలు

| ప్రభావిత రంగాలు | ప్రస్తుత స్థితి | భవిష్యత్తు స్థితి |
|---|---|---|
| పర్యావరణం | కరువు సమస్యను కొంతవరకు తట్టుకోవచ్చు. దిగుబడి ఆశావహం | వాతావరణ సవాళ్ల వల్ల కరువు తీవ్రతకు ప్రభావితం కావచ్చు |
| ఆదాయపరంగా | రైతుకు లాభదాయకంగా లేదు | వ్యవసాయం మంచి ఆదాయం ఇస్తుంది |
| పోషకాల పరంగా | సాగుదార్ల పోషక స్థాయిని కాపాడతాయి | మార్కెట్ అవసరాలకే ఉపయోగం. రైతుకు పోషక విలువలు ఇవ్వలేవు |
| సామాజికంగా | సంప్రదాయక ఆహారపు అలవాట్లకు, అనువైనవి | ఆహారపు అలవాట్లు మారిపోతాయి. కొత్త అలవాట్లు అవసరం అవుతాయి. |
| ఆర్థికంగా | మార్కెట్ సన్నద్ధత లేదు | మార్కెట్ సిద్ధమవుతుంది |

> సబ్సిడీ బియ్యం అందుబాటులోకి వచ్చిన తరువాత చిరుధాన్యాల వాడకం బాగా తగ్గిపోయింది. అదే సమయంలో ప్రజల పోషక ప్రమాణాలు కూడా బాగా తగ్గిపోయాయి.



స్థానికంగా లభించే చాలా రకాలైన చిరుధాన్యాలను ప్రత్యేకంగా సాగుచేయవలసిన అవసరం లేదు.

కీలకమైనది. వాస్తవానికి స్థానిక ప్రజలలో ఈ రెండు సమస్యలే ఎక్కువ తీవ్రంగా ఉన్నాయి.

వాతావరణపరమైన సవాళ్ళు, పర్యావరణ సేద్యంపై వాటి దుష్ప్రభావాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వెలుగులోకి రావడం తో చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఒడిశా దక్షణ ప్రాంతంలో వచ్చిన మార్పులపై అధ్యయనం జరిగింది. ఈ ప్రాంతం చిరుధాన్యాల సాగులో సంప్రదాయక కేంద్రంగా ఉంటూ వస్తున్నది.



గిరిజన తెగల వారికి పోషక విలువలు అందించడానికి చిరుధాన్యాలు చాలా ముఖ్యమైనవి.

## చిరుధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణాలు

వ్యాపార రంగంగా వ్యవసాయం మారిన తరువాత యుకలిప్టస్, ఆయిల్ పామ్, పత్తి వంటి పంటల సాగు విస్తరిస్తోంది. ఒకప్పుడు చిరు ధాన్యాల సాగు కోసం ఉపయోగించే పంట పొలాలను ఆహారేతర ఉత్పత్తులకు కేటాయించడం జరుగుతోంది. ఈ భూబదిలీకారణంగా ప్రజలఆహారఅవసరాలు,పోషకాలలభ్యతకు నష్టం ఎదురు అయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఒడిశా వంటి ప్రాంతాలలో అల్పాదాయ వర్గాల పేద ప్రజానీకానికి ఇది పెద్ద సమస్యగా తయారవుతుంది. పంటల సాగులో వైవిధ్యం, సంప్రదాయక పంటల సాగును ప్రోత్సహించడం తక్షణ అవసరమైన ప్రస్తుత పరిస్థితులలో కూడా ఆధునీకరణ, ఏక పంటల సాగును ప్రోత్సహించడం దురదృష్టం అని చెప్పక తప్పదు. ఫలితంగా వ్యవసాయదారులు తప్పనిసరిగా తోటల పెంపకంవైపు మళ్లక తప్పదు. వారి ఆహారపు అలవాట్లు కూడా మారిపోవలసి వస్తుంది. ఈ పరిణామాలు దీర్ఘకాలంలో వారి ఆరోగ్య స్థితిగతులపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో వేచి చూడాల్సిందే.

ఆహార పంటల సాగుకు అనువైన భూములు కావని సాకు చెబుతూ ఈ భుములను యుకలిప్టస్ వంటి చెట్లను నాటడానికి మళ్ళించివేస్తున్నారు. ఈ కరణంగా స్థానికులకు పెద్ద సమస్యగా ఉన్న పోషకాహార లోపం సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు మరింతగా క్షీణించిపోతున్నాయి. ఇదివరలో ఇక్కడ విస్తృతంగా సాగుచేస్తూ ఉన్న చిరుధాన్యాల సాగును ఇప్పుడు పూర్తిగా మానివేశారు. టేబుల్ 1లో చిరుధాన్యాల సాగు నుంచి భూమిని

> కాశీపూర్ బ్లాక్ సిరిగుడ గ్రామానికి చెందిన బలరాం బిద్యా నలుగురు ఆడపిల్లల తండ్రి. వాళ్ల పెండ్లి పేరంటాల బాధ్యతలు ఉన్నాయి. అందుకు చాలా డబ్బే కావాలి. రాగి సేద్యం ద్వారా వచ్చే ఆదాయం చాలా స్వల్పం. అందువల్లనే తనకున్న 30 ఎకరాల వ్యవసాయ భూమిలో 20 ఎకరాలను చిరుధాన్యాల (రాగి) సాగు నుంచి తప్పించి యూకలిప్టస్ చెట్లు పెంచడానికి మళ్లించాడు. మూడేండ్ల వ్యవధిలో ఏటా రూ.7000 ఆదాయం వస్తుందని అంచనా వేశాడు. రాగి సేద్యంలో కిలోకు రూ.21 మాత్రమే లభిస్తున్నది. ఆయనకు రాగి దిగుబడి కూడా కేవలం 100 కిలోలు మాత్రమే ఉండేది. అందువల్ల తాను భూ బదలాయింపు చేపడితే మంచి లాభాలు ఉంటాయని ఆశించాడు. గతంలో ఆయన చాలా రకాలైన రాగుల పంటలను పండించేవాడు. అయితే కాలంతో పాటు వచ్చిన మార్పులకు అనుగుణంగా ఆయన మడాయ్ ముస్కిలీ సాగు మాత్రమే చేస్తున్నాడు. అది ఇంటి అవసరాలకు సరిపోతోంది. కొద్దిగా ఉంటే దానిని స్థానికంగా ఉండే మార్కెట్‌కు తరలిస్తున్నాడు.

చెట్ల పెంపకానికి మళ్లించడం వల్ల ఇక్కడి ప్రజాజీవితానికి ఎలాంటి సమస్య ఎదురవుతుందో వివరిస్తుంది. ఈ పరిస్థితికి వాతావరణ మార్పులే ప్రధానంగా కారణం, పర్యవసానంగా స్థానిక జనజీవితంపై కూడా ప్రభావం తప్పకపోవచ్చు.

ప్రజారోగ్యం పరంగా రాగి, ఇతర చిరుధాన్యాల ప్రయోజనాలు ఇప్పటికే రుజువయ్యాయి. ముఖ్యంగా కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, తల్లిపాలు పెంపొందించగలగడం, కాల్షియం వంటి మినరల్స్‌తో పాటు సమృద్ధిగా ఫైబర్‌ను ఇవి సమకూరుస్తాయి. అయినప్పటికీ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం సబ్సిడీ ధరలకే లభిస్తున్న కారణంగా చిరుధాన్యాల వాడకం చాలా తగ్గిపోయింది. ఈ సబ్సిడీ బియ్యం కారణంగా ప్రజలకు పోషకాహారం కొరత తీవ్రమైంది. ఈ కారణాల వల్ల చిరుధాన్యాల సేద్యం చేసే విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. వాటి సాగుపై ఆసక్తి కూడా తగ్గిపోయింది. దాంతో పాటే సంప్రదాయక పంటలను మనం నష్టపోయాం.

జీవనశైలిలో మార్పులు కూడా ఉన్నత, మధ్య తరగతి వర్గాల ప్రజల్లో ఈ చిరుధాన్యాల వాడకం తగ్గడానికి కారణమవుతున్నాయి. ఇది చిన్న, సన్నకారు రైతులను చిరుధాన్యాల సాగుకు దూరం చేస్తున్నది. భవిష్యత్తులో వ్యవసాయాన్ని కాపాడేందుకు ఉపయోగపడే అనేక రకాలైన భూకమతాలు, పంటల రకాలు ఇప్పుడు కనుమరుగైపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో ఆ స్థితి వచ్చేసింది. ఒకప్పుడు దాదాపు పది పన్నెండు రకాలైన చిరుధాన్యాలను సాగుచేసేవారు. ఇప్పుడు ఒకటి రెండు రకాలు మాత్రమే సాగు చేస్తున్నారు. రాగి పంటల విషయంలో ఇదివరకు సంప్రదాయకంగా సాగులో ఉన్న రకాలు, పూర్తిగా అదృశ్యమైపోయిన రకాల చిట్టాను టేబుల్ 2లో చూడవచ్చు.

సామాజిక బాధ్యతలు కూడా వ్యవసాయ భూములను లేదా పశువుల మేతకు ఉపయోగించే భూములను యూకలిప్టస్ చెట్ల పెంపకానికి బదిలీ కావడానికి కారణమవుతున్న విషయాన్ని కాశీపూర్ బ్లాక్ సిరిగుడ రైతు బలరాం బైద్య ఉదంతం సూచిస్తున్నది. నలుగురు కూతుళ్ల పెండ్లి బాధ్యత కారణంగానే తనకున్న వ్యవసాయ భూమిలో మూడో వంతు భాగాన్ని రాగి సేద్యం నుంచి తప్పించి యూకలిప్టస్ చెట్ల పెంపకానికి మళ్లించాల్సి వచ్చింది. (బాక్స్ 1 చూడవచ్చు.) ఈయన అవసరాన్ని గమనిస్తే వ్యక్తిగత సమస్యలు కొన్ని సందర్భాలలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయేందుకు కారణమవుతుందని స్పష్టమవుతుంది. ఉత్పత్తి తగ్గటంతో వాటి కోసం మార్కెట్‌కు వెళ్లిన సామాన్య ప్రజానీకం నిరాశకు గురికాకతప్పదు. బలరాం వంటి కొద్ది మంది రైతులపైనే వారు ఆధారపడాల్సి వస్తుంది.

పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలలో ఈ విధమైన భూబదిలీ చాలా ఎక్కువగా ఉందని శ్రీమతి సుమన్ జోదియా అభిప్రాయపడ్డారు. సుమారు యాభై మంది రైతులు తమ భూముల్లో ఎక్కువ భాగాన్ని యూకలిప్టస్ తోటల పెంపకానికి మళ్లించినట్టు ఆమె తెలిపారు. ప్రభుత్వం ఒక్క రూపాయికే కిలో బియ్యం ఇస్తుండడంతో ప్రజల ఆకలి సమస్య పరిష్కారానికి రాగి వంటి చిరుధాన్యాలను సాగు చేయవలసిన అవసరమే లేకుండా పోయింది. ఇందువల్ల కూడా వీటి సాగుపై రైతులకు ఆసక్తి లేకుండా చేసింది. ఈమె అభిప్రాయాన్ని కమలినీ జోదియా, కుంజపతి జోదియా, సోబ్నీ జోదియా వంటి వాళ్లు కూడా అంగీకరించారు. వారంతా కూడా చిరుధాన్యాలను సేద్యం చేస్తున్న విస్తీర్ణం రోజురోజుకీ ఎలా తగ్గిపోతున్నదీ వివరించారు. చిరుధాన్యాల సేద్యం నుంచి పెద్ద మొత్తంలో వ్యవసాయ భూమి వాణిజ్య పంటల సాగుకు మళ్లించేయడం చాలా తీవ్రంగా సాగిపోతున్నది.

## చిరుధాన్యాల ఉత్పత్తి – వాస్తవ పరిస్థితి

ఇటీవల చిరుధాన్యాలకు పూర్వపు జనాదరణ సంపాదించడానికి చురుగ్గా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. అందుకోసం అనేక ప్రాంతాల్లో రకరకాల కార్యక్రమాలను చేపట్టడానికి కృషి జరుగుతున్నది. అయితే వాస్తవ పరిస్థితి మరోలా ఉంది. ప్రభుత్వపరంగా కానీ, ప్రయివేటు రంగం నుంచి కానీ, పౌర సమాజం కానీ అత్యంత విలువైన ఈ చిరుధాన్యాలను కాపాడేందుకు చాలా స్వల్పంగా మాత్రమే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం

**టేబుల్ 2. కోరాపుట్ ప్రాంతంలో కనుమరుగవుతున్న రాగి పంటలో రకాలు**

| రకం | స్థితి | కారణాలు |
|---|---|---|
| చిన్న కాని మాందియా | సాగులో లేదు | తోటలుగా మార్పు భూ బదిలీ |
| జానా మాందియా | సాగులో లేదు | యూకలిప్టస్, తోటలకు భూ బదిలీ |
| తెలంగాణ మాందియా | సాగులో లేదు | నలుపు రంగు కావడంతో గిరాకీ లేదు |
| ముగుడ మాందియా | సాగులో లేదు | యూకలిప్టస్, తోటలకు భూ బదిలీ |
| కాటరసింగ | సాగవుతోంది | సేద్య, ఆహార ప్రయోజనాలున్నాయి |
| మదాయి ముస్కిలి | సాగవుతోంది | సేద్య, ఆహార ప్రయోజనాలున్నాయి |

ప్రభుత్వం చిరుధాన్యాల రైతులకు కొన్ని హామీలు ఇచ్చింది. సాగునీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పిస్తామని, విత్తనాలు అందజేస్తామని ప్రకటించింది. అయితే వీటిని సాగుచేసేందుకు చాలా కొద్ది మొత్తంలోనే రసాయనిక ఎరువులు అవసరమవుతాయి. సహజంగానే చీడపీడలను తట్టుకోగలిగిన శక్తి ఈ పంటలకు ఉంటుంది. అందువల్ల ఈ పంటలకు ప్రోత్సాహం ఇవ్వాలని నిజంగానే ప్రభుత్వం భావించినట్లయితే, క్రిమిసంహారకాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి. కనీసం వాడకం తగ్గించేందుకు తోడ్పడాలి. ఎకరాకు వచ్చే దిగుబడి పేరుతో ఈ చర్యలను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం తన మద్దతును అందచేయాలి. అంతేకానీ, ఈ చిరుధాన్యాల సాగును కూడా వాణిజ్యపంటలతో సమానమైనవిగా పరిగణించడం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వం చిరుధాన్యాల సాగును కూడా వాణిజ్య పంటల మాదిరిగానే పరిగణిస్తుండడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోంది. బయటి నుంచి తెప్పించుకోవాల్సిన ఇన్‌పుట్స్ ఎక్కువ భారం అవుతున్నాయి. అయితే వీటికి ఎరువుల అవసరం కానీ, క్రిమిసంహారకాల అవసరం కానీ లేకపోవడం వల్లనే ఆయా ఎరువులు, క్రిమిసంహారకాల తయారీ సంస్థలు వీటిపై ఏ మాత్రం ఆసక్తి కానీ, శ్రద్ధ కానీ చూపించడం లేదు. చాలా సందర్భాలలో రైతులను చిరుధాన్యాల సేద్యం చేపట్టకుండా అడ్డుకునేందుకే ఎక్కువ ప్రయత్నిస్తున్నాయి. అంటే వ్యాపార సంస్థలు ఆసక్తి చూపించకపోవడం కూడా చిరుధాన్యాల సేద్యం వైపు రైతులను వెళ్లకుండా అడ్డుకుంటున్నది.

చాలా కాలంగా చిరుధాన్యాలను రైతులు సేంద్రీయ సేద్య విధానం లోనే సాగు చేసేవారు. అయితే ఇప్పుడు పట్టణ ప్రాంతాలలో వీటిని ఆరోగ్యదాయినిగా ప్రచారం చేస్తున్నారు. ఫలితంగా కొంత వరకు ఈ పంటలకు తిరిగి ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఒకప్పుడు కేవలం పేదరికానికి, వెనుకబాటుతనానికి గుర్తుగా మిగిలిపోయిన చిరుధాన్యాలు పోషకాహారంగా గుర్తింపు సమకూర్చుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఈ పంటల సాగును వాణిజ్యపరంగా కనిపిస్తోంది. అందువల్ల చివరికి ఈ పంటలసాగులో కూడా ఏకపంట విధానం ప్రబలుతోంది. ఇప్పటివరకు ఈ రకమైన విధానం వరి, మొక్కజొన్నలకే పరిమితంగా ఉండేది. ఇది కూడా ఒక విధంగా నష్టదాయకమే. ఎందుకంటే పంటల్లో వైవిధ్యం ఉండదు. ప్రకృతి సహజమైన కష్టనష్టాలు, చీడపీడలు అధికం కావచ్చు. అందువల్ల సమాంతరంగా భూ వినియోగానికి అనువైన విధానాలు చాలా ముఖ్యం.

## సాగు పద్ధతిలో బదిలీ ప్రాముఖ్యం

ప్రభుత్వ విధానాల్లో ప్రజలకు పోషక విలువలు సమకూర్చడం ఒక్కటే లక్ష్యం కారాదు. అలాంటి ప్రయత్నాలు మరో విధంగా చిరుధాన్యాల సాగుకు నష్టమే కలిగించవచ్చు. ఒక పక్కన ఆకలి బాధలను నివారిస్తూనే పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు కృషి చేయాలి. సాగు సంబంధిత వ్యూహ రచనలో వ్యవసాయానికి నిరంతరం ఊతం ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు విస్తరింపచేయడం, స్థానిక చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం కూడా చాలా అవసరం. ఈ విధానంలో వాణిజ్య పంటలతో పాటు చిరుధాన్యాల సాగుకు కూడా సముచితమైన ప్రాధాన్యం ఇవ్వాలి. కొన్ని రకాలైన చెట్ల పెంపకాన్ని కూడా ప్రోత్సహించాలి. ఈ విధంగా చెట్ల పెంపకం రైతులకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. చాలా మందికి ఈ చెట్ల పెంపకం వల్ల పేదరికం నుంచి విముక్తి లభించింది కూడా.

**టేబుల్ 3. విధానాల్లో మార్పులు - ఫలితాలు**

| ప్రభుత్వపరంగా | పర్యావరణ/సేద్య ప్రయోజనాలు | ఆరోగ్యపరంగా | ఆర్థికంగా |
|---|---|---|---|
| భూ వినియోగంపై నిర్బంధం, విత్తన కంపెనీల తోడ్పాటు | పంటల వైవిధ్యం స్థిరంగా ఉంటుంది | పోషకాలు, రుచికరమైన ఆహారం | భూసంరక్షణలో మంచిది |
| తోటలు/వాణిజ్య సాగుపై ఆంక్షలు, కమతాలపై పరిమితులు | పర్యావరణం, వైవిధ్యం సురక్షితం | పోషకాల సమృద్ధి | ఆదాయం పెంపు |
| ప్రైవేటు కంపెనీల తోడ్పాటు, (హార్లిక్స్ వంటివి) | ఏకపంటలకు ఊతం, పంటలకు భద్రత | స్త్రీ, బాలలకు పౌష్టిక ఆహారం, వాడకంలో గ్రామ, పట్టణాల్లో సమాన వృద్ధి | మార్కెట్ విస్తృతి |
| ఎండీఎం స్కీమ్‌లో చేర్పు స్థానిక సేకరణ వ్యవస్థ | స్థానికంగా ఉత్పత్తి పెంపు | పోషకాహారం, ఆహార అలవాట్లకు భద్రత | మార్కెట్ విస్తరణ |

అన్నిటికన్నీ ముందు రైతులకు సరైన అవగాహన కలిగించడం చాలా ముఖ్యం. చిరుధాన్యాల సాగు కూడా చాలా అవసరమని వారిలో చైతన్యం కలిగించాలి. స్థానిక పర్యావరణ అనుకూల సేద్యంలో మిశ్రమ పంటల సాగు గిరిజన ప్రాంతాల రైతులకు ఉపయోగకరమైనది. దానికే తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించాలి. ఇలాంటి స్థానికంగా రైతులు అనుసరిస్తున్న విధానాలు అన్ని రకాలైన వాతావరణ సవాళ్లను తట్టుకోగలిగిన విషయాన్ని వారికి వివరించి చెప్పాలి. అలాంటి పద్ధతులకు పూర్తిగా మద్దతు ఇవ్వాలి. ప్రోత్సహించాలి. వాతావరణపరమైన సవాళ్లకు ఇదే సరైన పరిష్కారమార్గం.

చెట్ల పెంపకం రైతులకు ఆర్థికంగా ఊతం ఇస్తుందనటంలో సందేహం లేదు. అలాగే వాతావరణ వైరుధ్యాలను, చీడపీడలను మరింత సమర్థవంతంగా తట్టుకోగలవనే విషయం నిస్సందేహమే. అయితే ఇటు చిరుధాన్యాల సేద్యం, చెట్ల పెంపకం రెండు విషయాల మధ్య సరైన సయోధ్య ఉండేలా పకడ్బందీగా విధాన నిర్ణయాలు జరగాలి. అలా కాని పక్షంలో ఆర్థికంగా తక్షణ ప్రయోజనాలను అందించే చెట్ల పెంపకం దీర్ఘకాలంలో వాతావరణ సమస్యల వల్ల నష్టాలకు కారణం కావచ్చు. చెట్ల పెంపకం లేదా చిరు ధాన్యాల సాగు దేన్ని నిర్లక్ష్యం చేసినా రైతుల ప్రయోజనాలకు హాని చేసినట్లే కాగలదు. అందుకు వాతావరణ సవాళ్లే ప్రధాన కారణంగా మారనూ వచ్చు.

వాతావరణ సవాళ్లను ఎదుర్కోడంలోనూ, ఆకలి బాధలను, పోషకాహార లోపాన్ని నియంత్రించడంలో మహిళా రైతుల పాత్ర అనన్య సామాన్యమైనది. గిరిజన ప్రాంతాలలో మహిళా రైతులే చిరుధాన్యాల పరిరక్షణలో ముందు నిలుస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. సంపద అంటే ఆరోగ్యమే అన్న మౌలిక సూత్రాన్ని మహిళలు అర్థం చేసుకున్నట్టు పురుష రైతులు అర్థం చేసుకోవటం లేదు. అందుకే ఆదాయం వృద్ధితో పాటు ఆరోగ్యానికి భద్రత ఇచ్చే మధ్యే మార్గాన్ని అనుసరించవలసి ఉంది. అప్పుడే పోషకాహారలోపం తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సుసాధ్యం కాగలదు.

## తక్షణ కర్తవ్యం

ఒడిశా రాష్ట్రంలోని 80 జిల్లాల్లో కొండ ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాలు రాగి, తదితర చిరుధాన్యాల సేద్యం అన్ని విధాలా అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లోనే గిరిజన జనం అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. వీళ్లందరికీ పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం అత్యవసరం. అందువల్ల కూడా ఈ పంటల సాగును ప్రోత్సహించడం ఈ ప్రాంతాల పేద ప్రజానీకానికి సరైన అవగాహన కల్పించడం కూడా అవసరం.

ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న, ఆచరణలో పెడుతున్న విధానాలు మాటల మూటలే తప్ప ఉపయోగంలేకుండా ఉంటున్నాయి. చిరుధాన్యాల సేద్యాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన సానుకూల చర్యలు నామమాత్రమే. అలాగే చిరుధాన్యాలలో అంతరిస్తున్న వైవిధ్యాన్ని కాపాడేందుకు ఎలాంటి ప్రయత్నాలూ జరగటం లేదు. ఇదే ధోరణి కొనసాగితే వాతావరణ సవాళ్లను ఎదుర్కోగలిగిన విలువైన ఆహార వైవిధ్యాన్ని కోల్పోవడం తప్పదు. ఆహార కొరతను ఎదుర్కోవడం తప్పదు. ఈ పరిస్థితుల్లో ఈ ప్రాంతాల్లో చిరుధాన్యాల సేద్యాన్ని ప్రోత్సహించేందుకు విధానపరమైన కొన్ని మార్పులను సూచించడం జరిగింది. (టేబుల్ 2 చూడగలరు.)

ఈ విధానపరమైన మార్పుల వల్ల చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఫలితంగా వాతావరణపరమైన అనేక చిక్కుల నుంచి బయటపడవచ్చు. పోషకాహార లోపాన్ని సరిదిద్దవచ్చు. ఈ క్రమంలో చిరుధాన్యాల సాగు సరైన పరిష్కారం చూపించగలదు. కేవలం ఆకలిని దూరం చేయడం ఒక్కటే లక్ష్యం కారాదు. ఆరోగ్యవంతమైన వాతావరణం ప్రజలకు అందించగలగాలి. ఇది దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విధానాల్లో తగిన మార్పులు చేపట్టాలి. ◆

**Ranjit K Sahu** is a freelance writer currently located in Virginia, USA
E-mail : sahurk9@gmail.com

**Ravi Shankar Behera**
Independent Freelance Development Consultant based in New Delhi
E-mail : rsbehera@rediffmail.com

**Srinibash Das**
District Coordinator,
Agragamee, Rayagada - 765001 Odisha
E-mail : dassrinivash@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 19, సంచిక 1, మార్చి 2017.

# సేద్య రంగంలో సంస్కరణలు

## వాతావరణ సవాళ్లకు సమాధానం

సురేష్ కన్నా కె

**సేద్య విధానాలలో సమూలమైన మార్పులు చేపట్టి సరికొత్త రూపం అందించగలిగితే వ్యవసాయ రంగంలో వినూత్న పురోభివృద్ధికి రైతు సోదరులు బాటలు వేయగలుగుతారు. అప్పుడే పెను సవాలుగా మారిన వాతావరణపరమైనసమస్యలకుపరిష్కారందొరకడంతో పాటు ఆహార భద్రత సాధ్యమవుతుంది. ఇందుకు అట్టడుగు స్థాయినుంచి సరైన వ్యవస్థ నిర్మాణం, విధానపరమైన మద్దతు అత్యవసరం.**

తమిళనాడులోని కుంభకోణం సమీపంలోని తేనాంపాడుగ్గై గ్రామానికి చెందిన ప్రముఖ సేంద్రీయ వ్యవసాయదారుడు భాస్కరన్. ఆయన దాదాపు 15 ఏండ్లుగా సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నాడు. తమిళనాడులో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిం చేందుకు విశేషంగా కృషి చేసిన డాక్టర్ నమ్మాళ్వార్ స్ఫూర్తితోనే భాస్కరన్ కూడా ఈ విధానం అనుసరించడం ప్రారంభించాడు. అధరంగం అనే ఊళ్లో ఏటా జరిగే నెల్ తిరువిజ (వరి ఉత్సవాలు) కార్యక్రమాలకు ఆయన ప్రతీసారీ తప్పనిసరిగా హాజరవుతారు. ఈ ఉత్సవాలు 2006లో ప్రారంభమయ్యాయి. సేంద్రీయ సేద్యం స్వయంగా చేయడమే కాకుండా సంప్రదాయక వరి రకాల సేద్యం ఆయన ప్రత్యేకత. నిరంతర అధ్యయన స్వభావం ఉన్న ఆయన తన పొలంలో ప్రతి మార్పును గమనిస్తూ వ్యవసాయం లోనూ, వాతావరణంలోనూ వచ్చే మార్పులపై ఎన్నో పరిశోధనలు చేశాడు. ఆయన క్షేత్రస్థాయి పరిశోధనలు, విశ్లేషణల ఫలితంగా సేద్యంలో వాతావరణ సవాళ్లను ఎదుర్కొని సేద్యం ఎలా చేయాలో పరిసరాల్లోని రైతులకు మార్గదర్శిగా నిలుస్తున్నారు. ఆయన ప్రభావం తమిళనాడులోని డెల్టా ప్రాంతాల్లోనూ, ఇతర ప్రాంతాలలోనూ కూడా చాలా ఎక్కువగా కనిపిస్తుంది.

### అనూహ్యమైన వాతావరణ మార్పుల ప్రభావం

సుమారు ఇరవై సంవత్సరాల క్రితం, వర్షాలు సమృద్ధిగా కురిసేవి. చెరువుల్లో, కుంటల్లో నీరు సమృద్ధిగా లభించేది. ఈ విధంగా నీటి సదుపాయం ఏడాదిలో దాదాపు పది నెలల పాటు సంతృప్తికరంగా ఉండేది. అందువల్ల ఏడాదికి రెండు పంటలు పండించడం సాధ్యమయ్యేది. వర్షాకాలం అంటే దాదాపు మూడు నెలల పాటు నిరాఘాటంగా కొనసాగుతూ ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. నదుల్లో కూడా నీరు నెల రోజులకంటే ఎక్కువ కాలం కనిపించటం లేదు. నీటి వనరులన్నీ ఎండిపోయాయి. నీటిని పంప్‌ల ద్వారా ఉపయోగించుకునేందుకు విద్యుత్ సదుపాయంతో పాటు బోర్‌వెల్ ఉన్న రైతులు తప్ప మిగిలిన వారు సేద్యం చేయడం చాలా కష్టంగా మారింది. ఫలితంగా చాలా పంట పొలాలు బీడు భూములుగా మిగిలిపోతున్నాయి.

వర్షాలు కురుస్తున్న తీరును అధ్యయనం చేసిన భాస్కరన్ 1991-95 మధ్య కాలంలో వర్షాకాలంలో వర్షాలు ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా కురిసేవని ఆయన గుర్తించారు. ఆ సమయంలో రైతులు రెండు పంట కాలాల్లోనూ పంటలు పండించేవారు. 2000వ సంవత్సరం నుంచి వర్షపాతం తగ్గుముఖం పడుతున్న విషయాన్ని ఆయన గమనించారు. అందువల్ల ఒక పంట మాత్రమే సాగు సాధ్యమయ్యేది. ఆ సంవత్సరం నుంచి 2004 వరకు వర్షపాతం దారుణంగా తగ్గిపోయి తీవ్ర క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన గమనించారు. అయితే 2005లో వర్షాలు పెద్ద ఎత్తున కురవడంతో దాదాపు వరద పరిస్థితి ఏర్పడింది. ఆ తరువాత నుంచి వర్షపాతం అస్థిరంగా ఉంటున్నది. కొన్ని సార్లు అధికంగానూ, కొన్ని సమయాల్లో అతి స్వల్పంగానూ వర్షాలు కురిసేవి. ఈ రకమైన అనిశ్చిత వర్షపాతం 2010 వరకు కొనసాగింది. ఆ తరువాత 2012, 2013 సంవత్సరాల్లో తీవ్ర స్థాయిలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన పరిశీలనలో గుర్తించారు.

ఆయన అధ్యయనంలో తేలిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రతి అయిదేండ్లకు ఒకసారి వర్షాభావం తప్పదని, ఒక సంవత్సరం వర్షపాతం అత్యధికంగా ఉంటుందని నిర్ధారణ చేశారు. అనంతరం ఒక ఏడాది అత్యంత తక్కువ మోతాదులో కేవలం పది రోజుల పాటే వర్షాలు కురుస్తాయని ఆయన అంచనా వేశారు. ఈ విధమైన అనిశ్చిత వర్షపాతం, వాతావరణ ప్రభావం కారణంగా రైతులు ఖచ్చితమైన సేద్య విధానాన్ని అనుసరించలేకపోయేవారు. ఏం సంవత్సరం వర్షపాతం ఏ మేరకు ఉంటుందో వారికి అర్థమయ్యేది కాదు. అది తెలియకపోవడం వల్ల ఏ పంట సాగు చేయాలో అర్థం అయ్యేది కాదు. వాతావరణ విభాగం అంచనాలు కూడా వాస్తవాన్ని ముందుగా సూచించలేకపోయేవి. ఫలితంగా రైతులు తమ అనుభవం ఆధారంగా తమ సేద్య విధానాన్ని రూపొందించుకునేవారు. వాటినే పాటించేవారు.



*ధానాల్ బృందానికి వాతావరణ తీరు తెన్నులను వివరిస్తున్న భాస్కరన్......*

## వాతావరణ ఆధారిత విధానాలు

వరి సేద్యంలో తన అనుభవాలే ప్రాతిపదికగా భాస్కరన్ వాతావరణ మార్పులను ముందుగానే అంచనావేసి వాటికి అనుగుణంగా సేద్యం ప్రారంభించాడు. 2012 సంవత్సరంలో రైతులంగా నీటి కొరత సమస్య ఎదుర్కోగా, ఏం చేయాలో తెలియని అయోమయంలో పడ్డారు. ఆ సమయంలో భాస్కరన్ తనదైన శైలిలో వరి నాట్లు చేపట్టాడు. అందుకు వెళ్లైపుని రకాన్ని 140 రోజులు సాగు చేపట్టాడు. సెప్టెంబర్‌లో కురిసిన వర్షం మడి దున్నడానికి అవసరమైన తేమను అందించింది. అదే సమయంలో విత్తనాల నాట్లు కూడా పూర్తి చేశాడు. విత్తనాలు మొలకెత్తడానికి ఆ తేమ సరిపోయింది. అక్టోబర్‌లో దీపావళి తరువాత పడిన మరో వర్షం మొక్కల పెరుగుదల మరి కొంత ఊతం ఇచ్చింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఆయనకు నదీజలాలు అందుబాటులోకి వచ్చాయి. జనవరి నాటికి ఆయన చేతికి పంట వచ్చింది. పొలాన్ని ఎండబెట్టడం, నీటితో తడపడం చాలా ప్రయోజనకరంగా ఉందని ఆయన గుర్తించారు. పది రోజుల పాటు మడి తడపడం 20 రోజుల పాటు ఎండ బెట్టడం పంటను చేతికి అందించిందని ఆయన అర్థం చేసుకున్నారు. ఇలా నేరుగా విత్తనాల నాట్లు చేపట్టడం, దుక్కి దున్నే క్రమంలో రైతు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, కొద్ది మాత్రపు వ్యర్థాలు పంట ఎదగడానికి సహకరించాయని కొద్ది పాటి నీటి వాడకంతోనే మంచి ఫలితాలు వస్తాయని ఆయన తెలుసుకున్నారు.

2016లో వాతావరణం అస్సలు వరి సేద్యానికి అనుకూలంగా లేదు. అయితే భాస్కరన్ సంప్రదాయకమైన వరి రకాలు కరున్‌కురువై, సార్న మసూరి రకాలు ఎంపిక చేసుకున్నాడు. జూన్ నెలలోనే నేరుగా నాట్లు చేపట్టాడు. తరువాతి మాసాల్లో వర్షం కురుస్తుందని అంచనా వేశాడు. కానీ వర్షం పడలేదు. సార్న మసూరి మెలకెత్తింది. కానీ ఎండి పోయింది. కరున్‌కురువై విత్తనాలు మెరుగైన పెరుగుదలను చూపించాయి. దీన్ని బట్టి కొద్దిపాటు నీటి సదుపాయం ఉన్నట్లయితే కురువై సీజన్‌కు అన్ని విధాలా అనువైన వరి రకం ఇదేనని ఆయన తెలుసుకున్నాడు.

సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో వచ్చే రెండో సీజన్‌లో కొద్దిపాటి నదీ జలాలు అందుబాటులో కనిపించాయి. వర్షాకాలం వానలపై నమ్మకంతో కొంత మంది రైతులు నేరుగా నాట్లు చేపట్టారు. ఊడ్పులు-నాట్లు మొదలుపెట్టారు. అయితే ఆ సీజన్‌లో డిసెంబర్ వరకు వర్షాలు పడలేదు. వరి పంట నిలదొక్కుకోలేదు. చాలా లోతైన బోర్‌వెల్స్ ఉన్న రైతులు మాత్రమే కొంతవరకు పంట అందుకోగలిగారు. మిగిలిన వారికి నష్టాలు తప్పలేదు. ఏడాది మొత్తం ఆదాయం కోల్పోయారు.

అదే సమయంలో అంటే డిసెంబర్, జనవరి మాసాల్లో తక్కువ నీటి అవసరం ఉంటుంది. అందుకని నీటి తేమ ఆధారంగానే మొలకెత్తగల అవకాశం ఉన్న పంటల సాగును ఎంపిక చేసుకున్నాడు. ఆ క్రమంలో మినుములు (ఏడీటీ-3), పెసలు (దేశీ రకం), నువ్వులు (టీఎంవా-3) సాగు చేపట్టాడు. డిసెంబర్ 20, 2016న ఆయన చేసట్టాడు. ఆ సమయంలో అనుకోకుండా డిసెంబర్ 27-28 తేదీల్లో ఒకసారి, జనవరి 20-21 తేదీల్లో ఒకసారి వర్షాలు కురిసాయి. ఎలాంటి సాగునీటి వసతి అవసరం లేకుండా సమృద్ధిగా పంట చేతికి అందింది. ఆయన పెరుగుదలను పెంపొందించే ఇన్‌పుట్లను కాని, చీడపీడల నివారణ ప్రయత్నాలు కాని చేపట్టవలసిన అవసరమే రాలేదు. అన్ని పంటలు మార్చి 25 2017 నాటికి చేతికి అందినాయి. రెండు ఎకరాల్లో 250 కిలోల నువ్వులు, రెండున్నర ఎకరాల్లో 1100 కిలోల మినుములు, ఒక్క ఎకరం నుంచి 350 కిలోల పెసలు పండాయి.

వాతావరణంలో మార్పులను భాస్కరన్ సద్వినియోగం చేసుకోగలిగారు. అందుకు ఆయన అనుసరించిన బహుళ పంటల విధానమే మంచి ఫలితాలకు దారి తీసింది. ఇతర రైతులు హైబ్రీడ్ వరి సాగు చేశారు. వారు వాతావరణం గురించి సరిగ్గా అవగాహన చేసుకోలేకపోవడమే అందుకు కారణం. ఫలితంగా తీవ్రంగా నష్టపోయారు.

## నేర్చుకోవలసిన పాఠాలు

వాతావరణంలో వచ్చే ప్రతీ మార్పులకు అనువైన సంప్రదాయక పంటలు ఉన్నాయి. ఈ పంటలు స్థానిక స్థితిగతులకు అనువుగా ఉంటాయి. మంచి ఫలితాలు అందిస్తాయి. ఎలాంటి వాతావరణ మార్పులనైనా తట్టుకుని రైతుకు ఆసరాగా నిలుస్తాయి. ఏ సీజన్‌కు ఏ పంట అనువైనదో రైతులు గుర్తించి ఆ రకమైన పంటలను సాగుచేస్తే మంచి ఫలితాలు సంపాదించగలుగుతారు.

రైతులు వరుసగా రెండు మూడు సీజన్లు వరి సాగు చేయకుండా ఉండాలి. సాంబా సీజన్‌లో వరి సాగు మంచిది. అనంతరం నేలలో ఉండే తేమను ఉపయోగించి పప్పు ధాన్యాలను సాగు చేయడం మంచి ఫలితాలనిస్తుంది. అంటే జనవరి మధ్యకాలం తరువాత మాత్రమే వాళ్లు పప్పు ధాన్యాల సాగు చేపట్టాలి. వేసవి నెలల్లో అంటే ఏప్రిల్-మే లో నేల పూర్తిగా ఎండిపోయి ఉంటుంది. ఆ సమయంలో వారు రాగి, బాజ్రా వంటి చిరుధాన్యాలను సాగుచేయాలి. ఆ విధంగా అప్పటి వాతావరణ పరిస్థితులకు అనువైన పంటలను చేపట్టేందుకు, మంచి ఫలితాలను సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఈ విషయంలో భాస్కరన్ అనుభవాలు మంచి ఉదాహరణ అని చెప్పాలి.

*భాస్కరన్‌ను సంప్రదించడానికి......... ఫోన్ నెం. 9442871049 తైనాంపడుగై, వయా పట్టీశ్వరమ్. కుంభకోణం, తమిళనాడు 612703* ◆

**Suresh Kanna K**
Kudumbam, No. 113/118, Sundaraj Nagar,
Subramaniyapuram, Trichy - 620 020, Tamil Nadu, India.
E-mail : sureshkanna_kudumbam@yahoo.in

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 21, సంచిక 1, జూన్ 2017.

# పశు పోషణ - స్వదేశీ సంప్రదాయం

కమల్ కిషోర్

**పశు పోషణలో మన దేశానికి ఒక ప్రత్యేకత ఉంది. దేశంలోనే పుట్టి పెరిగి దేశీయ పశు సంపదలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న పశువుల జాతులు లెక్కకి మించి ఉన్నాయి. పశు జాతుల్లోని వైవిధ్యమే సమస్యకు పరిష్కారంగా చెప్పాలి. అధికోత్పత్తి కోసం సంకర జాతుల వెంటపడాలనే ఆకర్షణ అప్పుడప్పుడు తలెత్తుతూనే ఉంటుంది. అది బాహ్య ఇన్‌పుట్స్‌పై అధారపడవలసిన బానిస బతుకులకు దారి చూపిస్తుంది. పైగా అది చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. ఆర్థికంగా భారమే కాకుండా నిర్వహణ పరంగా కొత్త సమస్యల్లోకి నెట్టివేస్తుంది.**

పల్లెసీమల్లోని నిరుపేదకుటుంబాలకు వ్యవసాయం, పశుపోషణ, ఉమ్మడి మైదానాలు ఒక సంక్లిష్ట జీవనోపాధి మార్గాలు. వాటి మధ్య ఉన్న అవినాభావ సంబంధం ఆ నిరుపేద, అట్టడుగువర్గాల కుటుంబాలకు కనీస జీవన స్థిరత్వాన్ని, భద్రతను పరిమిత స్వీయనియంత్రణకు ఆధారంగా ఉంటాయి. సాంప్రదాయకంగా సాధారణ కుటుంబాలలోని వారికి పశుపోషణకు అవసరమైన మేతను సమకూర్చుకునేందుకు ఉమ్మడి గడ్డి మైదానాలు, వ్యవసాయం చేయగా వచ్చిన వ్యర్థ పదార్థాలు అత్యవసరం. పంట పండించేందుకు అనువుగా ఉన్న మిగిలిన భూమిలో సేద్యం చేసుకుంటారు. ప్రస్తుతం జనాభా విపరీతంగా పెరిగిపోయింది. పప్పుధాన్యాలకు గిరాకీ పెరిగింది. విత్తనాలు, పండ్లు, కాయగూరలు మొదలైన అనేక అనుబంధ ఉత్పాదనలకు ప్రాధాన్యం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో వీటిమధ్య ఉన్న కొద్దిపాటి వ్యత్యాసం కూడా చాలా ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ పరిస్థితిలో చాలా కుటుంబాలు అతి తక్కువ భూమిని మాత్రమే పశువులకు అవసరమైన మేతకోసం వదిలేస్తున్నారు. దేశం మొత్తం మీద కూడా సగటున 4 నుంచి 5 శాతం మాత్రమే పశుదానా పెంపకానికి వదిలేస్తున్నట్లు తెలుస్తున్నది. దాదాపు 60 ఏళ్ళుగా ఇదే పరిస్థితి.

పశుపోషణ ఈ మూడింటిలో చాలా కీలకమైనది. ఎందుకంటే ప్రస్తుతం వ్యవసాయం అనూహ్యమైన కష్టనష్టాలతో కూడివున్నది. వీటి ఒత్తిడి నుంచి కుటుంబానికి ఎంతో కొంత ఊరటనిచ్చేది ఈ పశుపోషణే. ప్రధానంగా వ్యవసాయంలో అనుసరిస్తున్న సాగు విధానాలలో బాహ్య వస్తువుల వినియోగం చాలా ఎక్కువగా ఉంటోంది. అధికోత్పత్తికి ప్రాధాన్యత ఎక్కువైంది. ఇక మార్కెట్లు ఎన్నో ఒడిదుడుకుల మధ్య సాగుతూ ఉంటుంది. అదీకాక, ఇప్పటికీ పశుపోషణ పూర్తిగా ప్రకృతి వనరులపైనే ఎక్కువగా ఆధారపడి సాగుతుంది. బయట మార్కెట్ నుంచి కొనితెచ్చే వనరులు స్వల్పమే. అలాగే బయటకు కనిపించే కారణాల ప్రాతిపదికగా పశుపోషణ చేపట్టడం జరగదు. అందువల్ల వ్యవసాయరంగం ఎన్ని ఒడిదుడుకులలో సాగినా, పశుపోషణ దేశ గ్రామీణ ప్రాంతాల మొత్తం స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి) లో 40 శాతం వాటా అందజేస్తోంది. ఇక మెట్ట ప్రాంతాలలోనూ పాక్షిక మెట్టప్రాంతాలలోనూ, వర్షాకాలంలోని మూడు నుంచి ఆరు నెలలపాటు మాత్రమే సేద్యం సాధ్యమవుతుంది. నీటి పారుదల వ్యయం కారణంగా చాలామంది రైతులకు ఆ ఆశే ఉండదు. అందువల్లనే గ్రామ ప్రాంతాలలో అత్యధిక కుటుంబాలకు పశుపోషణే జీవనాధారం.

ఇలా పశువులను పెంచడం వల్ల కలిగే కొన్ని ప్రయోజనాలు ఇలా ఉంటాయి.

- ఆహార యోగ్యమైన, అందుకు భిన్నమైన ఉత్పత్తులు
- పశువుల సాయంతో విద్యుదుత్పత్తి, పేడ, మూత్రం ఇతర వ్యవసాయ వ్యర్థాల సేకరణ
- నిలకడ అయిన ఆదాయం సమకూర్చుకోవడం
- పేదకుటుంబాలకు పంటనష్టాల వంటి అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకుని నగదు అవసరాలు తీర్చుకోవడం
- సామాజిక-సాంస్కృతిక కార్యకలాపాల్లో భాగం సమకూర్చుకోవడం

పశు సంరక్షణలో మన దేశానికి ఒక విశిష్ట స్థానమే వుంది. ఎన్నోజాతుల పశువులు ఇక్కడ లభిస్తాయి. రకరకాలైన పశువులతోపాటు గడ్డిమేత ఆధారంగా జీవించే జీవాలు, కోళ్ళు, బాతులు వంటి పక్షిరకాలు, పందులు, గాడిదలు, గుర్రాల వంటివి అనేకం కుటుంబాల పెంపకంలో కనిపిస్తాయి. ఈ రకమైన జీవాల్లో ఉన్న వైవిధ్యమైన ఒక రకంగా నష్టనివారణ సాధనంగా అర్థం చేసుకోవాలి. సాంప్రదాయం ద్వారా వచ్చిన ఎంపిక విధానాల్లో పశువుల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలు 1. వాతావరణ మార్పులను తట్టుకోగలగడం. 2. వ్యాధి నియంత్రణ శక్తి కలిగివుండడం. 3. ఆహారం కొరతగా ఉన్నా నిలబడగలగడం. 4. మైదానాల్లో తిరిగి ఆహారాన్ని వెతికి తినగలగడం. 5. అందుబాటులో వుండే విభిన్నమైన ఆహారాన్ని స్వీకరించగలగడం. 6. దీర్ఘకాలం జీవించగలగడం.

విభిన్నమైన ఈ పశుసంపద తరాల అంతరాలను దాటి సాగుతూ గడ్డి మైదానాల పెంపకం, ఆయా పశుపోషణ చేపట్టిన కుటుంబాల మధ్య ఉన్న సాన్నిహిత్యానికి మచ్చుతునక. ప్రత్యేక లక్షణాలను

కలిగివున్న ఈ పశుపోషణ నైపుణ్యం దేశమంతటా కనిపిస్తూనే వుంటుంది. శతాబ్దాలుగా ఎన్నోజాతులు ఈ అంశం పైనే దృష్టిపెట్టి అధ్యయనం చేసి, తమ తమ పరిసరాలలోని వైవిధ్యంతో కూడిన వాతావరణాలకు, సేద్య విధానాలకు అనువైన పశుజాతులను గుర్తించి తమ ఆహార విధానాలను కాపాడుకుంటున్నారు. ఆ విధంగా ప్రత్యే లక్షణాలున్న పశుజాతుల పోషణను తమ జీవితాలకు ఆలంబన చేసుకొని వాటి సంరక్షణలో కీలక భాగస్వాములుగా నిలుస్తున్నారు. అయితే గడచిన 70 సంవత్సరాల కాలంలో దేశీయ పశుసంపదను కాపాడేందుకు ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రయత్నమూ జరగకపోవడం బాధాకరమే.

ఈ సందర్భంలో పాలమార్కెట్‌కు సంబంధించిన వ్యవస్థను గుర్తించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంత ఆర్థిక రంగంలో వ్యవస్థీకృత పాడిరంగం మార్కెట్‌ను దాదాపు 30 శాతం వరకు ఆక్రమించేసింది. వ్యక్తిగతంగాకానీ, గ్రూపులవారీగాకానీ, పాల మార్కెటింగ్ ఇంకా అవ్యవస్థీకృతంగానే మిగిలిపోయింది. వ్యవస్థగా ఏర్పడిన రంగం ఈ అవ్యవస్థీకృత భాగస్వామ్యాన్ని దారుణంగా అణచివేసింది. కుటుంబపరంగా ఇలా పాలను విక్రయించడం వల్ల హెచ్చుగా లాభాలు కాకున్నా గణనీయమైన ఆదాయాన్నే సంపాదించుకుంటున్నారు. దేశీయ పశువులు రోజుకు సగటున ఇప్పుడు (అంటే 2011-12) 2.2 లీటర్ల పాలు ఇస్తున్నాయి. అంతకుముందు దశకంలో అంటే 1990-91లో సగటు రోజువారీ పాల దిగుబడి 1.1 లీటర్ మాత్రమే. ఈ పెరుగుదల కూడా ఎలాంటి ప్రోత్సాహకాలు లేకుండానే సాధ్యమైంది. కరువు పరిస్థితుల్లో కూడా ఈ పశువులు నిలదొక్కుకోగలిగాయి. అతితక్కువగా లభించిన కొద్దిపాటి ఆహారంతోనే మనగలిగాయి. అయితే ఆ సమయాల్లో అత్యవసర నగదు అవసరాలకోసం వాటిని రైతులు తక్కువ ధరలకే అమ్ముకోవలసిన అగత్యం ఏర్పడేది.

సంప్రదాయకంగా కేవలం పాల ఉత్పత్తికోసం మాత్రమే పశుపోషణ జరగలేదు. వ్యవసాయరంగంలో అధికోత్పత్తి సాధనలో పాడిపశువుల ప్రాధాన్యత చాలా కీలకమైనది. ముఖ్యంగా ఎరువులను అందించడం, కరువు సమయాల్లో విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా పశుశక్తి ఉపయోగపడుతూ ఉంటుంది. ఈ పశువులకు మేతగా వ్యవసాయంలో పేరుకున్న చెత్తాచెదారం.

పరిశ్రమల్లో మిగిలిన వ్యర్థాలనే ఉపయోగించేవారు. ఈ రెండు ఉత్పత్తి ప్రక్రియలు గ్రామీణ జీవనోపాధికి మూల స్తంభాలుగా ఉండేవి. అందువల్లనే కరువు పరిస్థితులను తట్టుకోగలగడం ఒక విశేషమైన లక్షణంగా పశువుల ఎంపిక విధానం గురించి ప్రస్తావించ వలసి వచ్చింది.

సంప్రదాయక పశుపోషణలోని మరో ముఖ్యమైన అంశం - పశుపోషణ ఆధారంగా గ్రామాల్లో మరికొన్ని వ్యవస్థలు రూపుదిద్దుకున్నాయి. వాటిలో ఒకటి పశుపాలకులు. పశువులను మైదానాలకు తీసుకెళ్ళి వాటికి మేత సమకూర్చడం ఈ కాపరుల ప్రధాన జీవనోపాధి. ఇది కొన్ని శతాబ్దాలుగా స్థిరపడిపోయింది. వీరి పాత్ర పశుసంరక్షణ, పర్యవేక్షణ, ప్రమేయం పల్లెసీమల్లో ఎన్నోకుటుంబాలకు ఆసరాగా ఉంటున్నది.

అయితే వ్యవసాయానికి సంబంధించి, పశు ఉత్పత్తి వ్యవస్థలో కూడా ఏకీకృత కోణం విస్తరిస్తోంది. అంటే ఏదో ఎంపిక చేసిన జాతి పశువుల ఉత్పత్తిని మాత్రమే అధికం చేసేందుకు ప్రోత్సాహాలు అందుతున్నాయి. అధికంగా పాల ఉత్పత్తి సాధించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక మేతను అందించడం, యాంటీబయోటిక్స్, ప్రోబోయోటిక్స్ వంటి ప్రేరకాల వాడకం పెరిగిపోతోంది. గతాం కాలను పరిశీలిస్తే ఈ రకమైన అధికోత్పత్తి ప్రయోగం యూరోప్ వంటి దేశాల్లో కూడా సుస్థిరం కాలేదని తెలుస్తోంది. వీటివల్ల రైతులకు అధికవ్యయం తప్పదు. ఈ ఖర్చులు భరించలేక చాలామంది ఈ రంగంనుంచి తప్పుకుంటున్నారు కూడా. ఉదాహరణకు 1984నుంచి 2008 మధ్య కాలంలో డెన్మార్క్‌లో పశుపోషకుల సంఖ్య 33800 నుంచి 3800కు పడిపోయింది. పశుపోషణ భారీవ్యయంతో కూడినది కావడంతో వారిని అప్పుల ఊబిలో పడేసింది. మొత్తం అన్ని అంశాల్లోనూ సబ్సిడీలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు మనదేశం కూడా అదే దారిలో సాగుతోంది. అధికోత్పత్తి ప్రధానమైన అంశంగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే కొద్దికాలంలోనే మన దేశీయ పశుసంతతి అదృశ్యం కాగలదు. అంతేకాక బయటినుంచి పెద్ద ఎత్తున పశువుల మేతనూ, మందులనూ, చివరికి పశుసమృద్ధికి ఇతర దేశాలనుంచి ఉత్తమజాతి వీర్యాన్ని కూడా దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి తప్పదు. సహజంగా ఇలాంటి వనరులు ఎప్పుడూ కొద్ది మంది లేదా సంస్థల చేతుల్లోనే ఉంటాయి. ఇది మన పాడి పరిశ్రమను దేశీయ సార్వభౌమత్వం నుంచి దూరం చేసి మొత్తం దేశ ప్రయోజనాలకే హానికరం కాగలదు. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఈ రకమైన విధానం వ్యవసాయ ప్రధానమైన దేశ వాతావరణానికి ఏ విధంగానూ అనువైనది కాదు. ఇక్కడి ఆర్థిక స్థితికి సరైనవి కావు. మన దేశం ఉష్ణ మండల ప్రదేశంలో ఉంటుంది. ఇక్కడి వాతావరణానికి ఇవి ఉపయోగపడవు. అందువల్ల సందర్భం గుర్తించకుండా అధికోత్పత్తి ఏకైక లక్ష్యంగా ఇలాంటి విధానాలను ప్రవేశపెట్టడం మంచిది కాదు. పూర్తిగా వర్షాధారితమై, కరువుకాటకాలు సర్వసాధారణమైన, మెట్ట ప్రాంతాలు, తేమ అధికంగా ఉన్న దేశంలో ఇవి ప్రయోజనకరం కాదు.

దేశీయ పశుసంపద తరతరాల పశుపోషణ విజ్ఞానానికి నిదర్శనం. మైదానాలను పెంచి పశుసంరక్షణలోనే జీవిస్తున్న జాతులు అనేకం.

ఈ సందర్భంలోనే సంకర పశు వృద్ధి గురించి మరింత లోతుగా ఆలోచించాలి. ఈ పద్ధతి మంచిదీ కాదు. చెడ్డదీ కాదు. ఇది కేవలం ఒక సంతతి వృద్ధి ప్రక్రియ. అందుబాటులో ఉన్న వనరులను ఆధారం చేసుకుని రైతుల అవగాహన, ఇక్కడ వాతావరణ స్థితిగతులు దృష్టిలో ఉంచుకునే సందర్భాన్ని బట్టి పరిశీలించవలసిన అంశం. పూర్తిగా మేలు జాతి అనే కోణంలో ఆలోచించడం సరికాదు. అలా చేయడం అంటే క్షేత్ర స్థాయి పరిస్థితులను పట్టించుకోకపోవడమే అవుతుంది. ఇప్పుడు సమస్య పాల ఉత్పత్తి పెరగడం లేదు. అలా అని తగ్గడం లేదు. నిలకడగా ఉండిపోయింది. సంకర జాతి పశువులు (1990-91 మధ్య కాలంలో 10 లీటర్లు పాలు ఇచ్చేవి. అయితే 2010 నుంచి 2012 మధ్య కాలంలో వాటి నుంచి కేవలం 6.8 లీటర్లు మాత్రమే లభిస్తున్నాయి.) వివిధ రాష్ట్రాలలో పరిస్థితి పరిశీలిస్తే, సంకర జాతి పశువుల నుంచి పాల దిగుబడి క్రమంగా తగ్గిపోతోంది. (గతంలో దేశీయ పశువులు 6 నుంచి 8 సార్లు పాలిచ్చేవి. కానీ ఈ సంకర పశువులు కేవలం 2.5 సార్లు మాత్రమే పాలు ఇవ్వగలుగుతున్నాయి. అదే సమయంలో ఇక్కడి ఉష్ణ వాతావరణానికి అవి తట్టుకోలేకపోతున్నాయమని తేలింది. వాటికి శీతల వాతావరణం ఎక్కువ అనువుగా ఉంటుంది. అందుకోసం వాటికి శీతలీకరణ వాతావరణం కృత్రిమంగా ఏర్పాటు చేయాల్సి వస్తున్నది. ఇది మరో ఖర్చు భారంగా తయారైంది. వాటికి రోగ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. అవి మేత కోసం ఎక్కువ దూరం నడిచి వెళ్లలేవు. స్వల్పకాలంలో వాటి నుంచి అధిక పాల దిగుబడి వచ్చే మాట నిజం. కానీ, దీర్ఘకాలంలో అవసరమైన అధిక ఖర్చుల భారం లెక్కకడితే తక్కువ సార్లు పాలు ఇవ్వటం, దేశీయ పశువులతో జతపరచినప్పుడు దూడల జననం రేటు చాలా తక్కువగా ఉండడం వంటివి చూస్తే ఆర్థికంగా కూడా ఇవి లాభసాటి కాదని ఎవరికైనా తెలిసిపోతుంది. దేశీయ పశు జాతులు దీర్ఘకాలంలో ప్రయోజనాలు చూపిస్తాయి. ఇక్కడ గమనించవలసిన మరో అంశం ఉత్తమ జాతి పేరుతో చేసిన సంకరం తీరులోనే ఉత్తరాది పశువులతో సంకరం చేసినా కూడా ఫలితాలు ఇంతకంటే మెరుగ్గా కనిపించలేదు. ఎందుకంటే అవి కూడా వాటికి అనువైన

వ్యవసాయరంగ సుస్థిరతలో పశుసంపద ప్రాధాన్యత చాలా ఉంది. ముఖ్యంగా పంటలను కాపాడేందుకు అవసరమైన ఎరువులు పశువుల ద్వారానే లభిస్తాయి. ఇంకా విద్యుత్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఉపయోగపడతాయి.

వాతావరణంలోనే నిలదొక్కుకోగలవు. ఉదాహరణకు ముర్రా జాతి పశువులకు ఎడాపెడా ప్రోత్సహించారు. సగటున ఈ రకమైన సంకర జాతి కేంద్రాలను గట్టిగా మూడు నుంచి ఆరేండ్ల లోపున మూసివేయకతప్పడం లేదు. ఈ ప్రయోగాల వల్ల మరిన్ని సమస్యలు, వ్యతిరేక ఫలితాలు మాత్రమే ఎదురయ్యాయి.

ఇక పశుపోషణకు అయ్యే మొత్తం ఖర్చులో వాటి మేతకే 60 నుంచి 70 శాతం అవుతుంది. వాటికి కావలసింది ఎండిన గడ్డి. ఇంకా పచ్చ గడ్డితో పాటు కొన్ని ఇతర రకాలు. ఎక్కువ భాగం ఎండు గడ్డి ఉమ్మడి మైదానాల్లో లభిస్తుంది. కొంత వ్యవసాయ భూముల నుంచి కానీ మార్కెట్ నుంచి కొని తెచ్చుకోవాలి. మెట్ట ప్రాంతాల్లో ఉమ్మడి భూముల ద్వారా దాదాపు 70 శాతం మేత లభిస్తున్నది. పాక్షిక ఉష్ణ ప్రాంతాల్లో ఇది 60 శాతం మాత్రమే. నాట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోను, గోధుమలు, చిరుధాన్యాలు,పప్పు ధాన్యాలు వంటి ఆహారపదార్థాలను పండించే ప్రాంతాల్లోను పశు సంపద అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అంటే వ్యవసాయ వ్యర్థాలపైనే పశువుల పెంపకం ఎక్కువగా జరుగుతున్నదని స్పష్టమవుతుంది. దేశమంతటా ఇటీవల కుటుంబ వ్యవసాయం చేసే వాళ్లంతా వాణిజ్య పంటలపైనే దృష్టి పెడుతున్నారు. చాలా మెట్ట ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ఫలితంగా పశువుల మేత దొరకడం పెద్ద సమస్యగా తయారైంది. దేశంలో గుర్తించిన 55 మైక్రో రీజియన్స్‌లో 43 చోట్ల మేత లభించడం కష్టంగా మారింది. ఆయా ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది. ఇందుకు వ్యవసాయేతర అవసరాలకు భూమిని మళ్లించడమే ముఖ్యమైన కారణం. అలాగే ఆహార పంటల సాగు నుంచి వాణిజ్య పంటలకు భూ బదిలీ మరో ముఖ్య కారణం. ఆయిల్ కేక్‌ను విదేశాలకు ఎగుమతి చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం కూడా ఒక కారణం.

ఇక మరో విషయం గమనించవలసి ఉంది. గడ్డి మేతపై జీవించే పశువుల్లో చిన్న వాటినుంచి 98 శాతం, పెద్ద జీవాల నుంచి చెప్పుకోదగిన మొత్తంలో మాంసం లభిస్తున్నది. ఈ జంతువుల నుంచే 70 శాతం పాలు గడ్డి మేసే పశువుల నుంచే లభిస్తున్నది. ఈ గణాంకాలు గమనిస్తే అభివృద్ధిపరమైన చర్యలను ఏ దిశగా చేపట్టాలో అర్థం అవుతుంది.

చివరిగా, పశువుల మేత కోసం గడ్డి పెంచే మైదానాలను ఎక్కువగా ప్రోత్సహించడం తక్షణ అవసరం. ఇది అసాధ్యం కాదు కూడా. ఈ విషయాన్ని ఫౌండేషన్ ఫర్ ఎకొలాజికల్ సెక్యూరిటీ, డబ్ల్యూటీఆర్, మరి కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిరూపించాయి. ఉమ్మడి గడ్డి మైదానాలను ప్రోత్సహించినట్లయితే మేత ఉత్పత్తి రెండు నుంచి మూడు రెట్లు పెరుగుతుందని స్పష్టమైంది. అయితే ఇది జరగాలంటే స్థానిక సమాజం కీలక భాగస్వామిగా బాధ్యత చేపట్టాలి. అందుకు అనువుగా చర్యలు చేపట్టాలి. ప్రత్యేకంగా

ఇందుకోసం భూమిని కేటాయించడం అంత తేలిక కాదు. పశు పోషణ చేపట్టే చాలా మందికి సొంతంగా భూసదుపాయం లేని వారే. మిగిలిన వారు చాలా కొద్ది మాత్రం భూమి ఉన్నవారు. అందువల్ల వారికి పశువుల కోసం గడ్డి కొనటం సాధ్యం కాదు.

ఈ పరిస్థితి దృష్ట్యా ప్రోత్సాహం అవసరమైన కొన్ని చర్యలు ఇక్కడ పరిశీలించవచ్చును.

- వ్యవసాయ విధానాల్లో ఆహారంగా ఉపయోగపడే బయోమాస్ తయారీకి అనువైన పంటల సేద్యాన్ని ప్రోత్సహించాలి.
- ఉమ్మడి భూముల్లో ఇటువంటి బయోమాస్ ఉత్పాదనను పెంపొందించడం
- విభిన్న వ్యవసాయ - వాతావరణ అనుకూలమైన పశు సంతతిని ప్రవేశపెట్టాలి. అనుమతించాలి.
- పశ్చిమ ప్రాంతంలో అధిక పాల దిగుబడినిచ్చే జాతి పశువులను ఉపయోగించి స్థానికంగా వాటి పెంపకాన్ని ప్రోత్సహించాలి.
- పాల దిగుబడి గణాంకాలను రైతు ముంగిటే సేకరించాలి.
- మేలు జాతి ఆంబోతులను, ఎనుబోతులను అధిక పాల దిగుబడినిచ్చే పశు సంతతి పెంచేందుకు ఉపయోగించాలి.
- వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మేలు జాతి పశువుల ద్వారా సంకర జాతి పశువుల వృద్ధికి చర్యలు తీసుకోవాలి.
- వివిధ ప్రాంతాల్లో పాల దిగుబడి పోటీలను పెట్టి మేలు జాతి పశువులను ఎంపిక చేయాలి.

ఈ ప్రక్రియ కొద్దిగా నెమ్మదిగా జరిగే మాట నిజం. కాని పటిష్టమైన శక్తివంతమైన దేశీ పశు సంపదను సమకూర్చుకోవడం సాధ్యమవుతుంది. జన్యుపరంగా ఉత్తమ జాతి పశువులను పెంపొందించుకోవచ్చును. ఇతర మార్గాల కన్నా ఈ అంశాలను పరిశీలించి ఆచరణలో పెడితే మంచి ఫలితాలు ఉంటాయి. ◆

**Kamal Kishore**
Coordinator
RAINFEED LIVESTOCK NETWORK
Anchored by Foundation for ecological security, Anand
E-mail : kamal_3456@yahoo.co.in

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 25, సంచిక 1, సెప్టెంబర్ 2017.

https://leisaindia.org
A website for learning and sharing experiences on LEISA practices




Follow us on Facebook: www.facebook.com/Leisaindiamag
Follow us on Twitter: @LeisaIndia

# దక్షిణభారత మహిళా పశుపోషకులు

## స్థానికజాతి పశువులు పెంచడానికే ఇష్టపడతారు

ఇల్సేకొహ్లెర్ – రాల్లెఫ్సన్ మరియు కార్తికేయ శివసేనాపతి

**దక్షిణభారతదేశంలోని మహిళలకు, స్థానికజాతి పశువులు పెంపకం సులువుగా ఉండి వారికి కొంత అదనపు ఆదాయాన్ని సమకూరుస్తుంది. పశువుల పోషణ రోజులో కొద్దిసేపు చేసే పని కాబట్టి వారు ఈపనితోబాటు ఆదాయం సమకూర్చే ఇతరపనులు కూడా చేసుకోవచ్చు. వసతికి, దాణాకి అవసరమైన పెట్టుబడి తక్కువగా ఉండడం, దృఢంగా ఉండి బాగా అభివృద్ధి చెందడంవంటి ప్రయోజనాల వలన పశుపోషణకు స్థానికజాతులే అనువుగా ఉన్నాయని అనేకమంది మహిళలు భావిస్తున్నట్లు రచయితలు కనుగొన్నారు.**

ప్రపంచంలోని పశుపోషకులలోమూడింట రెండవవంతు, అంటే దాదాపు 600 మిలియన్లలో 400 మిలియన్లమంది, మహిళలే. కాబట్టి మహిళలు, పశుపోషణ అన్న అంశంమీద ఎన్నో అధ్యయనాలు జరిగాయంటే ఆశ్చర్యంలేదు. ఐఫాడ్ (ఐ.ఎఫ్.ఎ.డి.) మరియు హీఫర్ (Heifer) వంటి సంస్థలు పశుపోషణాభివృద్ధికిలింగపరమైనమార్గాన్నిఅవలంభించారు.కానీ మహిళలు, పశుసంపద, దారిద్ర్య నిర్మూలనకు సంబంధించిన రిపోర్టులలో, వారు ఏఏజాతులమేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు వంటిపశువులను పెంచారన్నది స్పష్టంగా పేర్కొనడం జరుగలేదు. సాధారణంగా అధిక దిగుబడిని ఇస్తాయనుకునే, ''మేలైనవి''గా పరిగణించబడే విదేశీ లేదా సంకరజాతి పశువులనే ప్రోత్సహించడం జరుగుతుంది.

అయితే దక్షిణభారతదేశంలోని తమిళనాడు, కేరళరాష్ట్రాలలో అనేకమంది మహిళా పశుపోషకులు స్థానికజాతులనే విజయవంతంగా పోషిస్తున్నారు.

### మెచేరి గొర్రెలతో మనుగడ

తమిళనాడులోని తిరుపూర్ జిల్లాకు చెందిన వీరసోలాపు గ్రామంలో నివసించే అరవయ్యేళ్ళ పళని అమ్మాళ్‌కు భర్తలేడు. 13 గొర్రెలున్న మెచేరి గొర్రెల మందే ఆమెకు జీవనాధారం. మెచేరి అన్న బొచ్చు జాతి గొర్రె చర్మం చాలా ప్రశస్తి చెందింది. కోరంగాడు, స్థానిక మేపుదల వ్యవస్థకు ఈ జాతి అత్యంత అనుకూలం. కోరంగాడు అన్నది చుట్టూ జీవకంచె ఉండి, అనేక చెట్లున్న పచ్చిక బయలు ప్రదేశం. ఈ ప్రదేశంలో తెల్లతుమ్మ చెట్లు, అంజన్ గడ్డి మరియు ఇతర గడ్డిజాతులు, చిక్కుడు జాతి అడవి మొక్కలూ ఎక్కువగా ఉంటాయి.

సగటున ఒక్కో మెచేరి గొర్రె తడవకు ఒక్కోటి చొప్పున రెండేళ్ళలో మూడు సార్లు ఈనుతుంది. అంటే సంవత్సరానికి 1.5 పిల్లలు లేదా ఎనిమిది నెలలకు ఒక గొర్రెపిల్ల. పళని అమ్మాళ్ గొర్రెల పెంపకాన్ని పదేళ్ళముందే చేపట్టింది. ఒక ప్రభుత్వ పథకంలో భాగంగా 10 ఆడ గొర్రెలు, ఒక గొర్రెపోతు కొనడానికి ఆమెకు రూ. 15,000/- (50% అప్పుగా, మరో 50% సబ్సిడీగా) లభించింది.

తన గొర్రెల మందను మేపడానికి ఆమె ఒక గౌండు మహిళకు చెందిన 7 ఎకరాల కోరంగాడు పచ్చిక బయలును, సంవత్సరానికి రూ. 5,000/- చొప్పున లీజుకు తీసుకుంది. ఈ ఖర్చుపోను గొర్రెపిల్లల అమ్మకం ద్వారా ఆమెకు రూ. 5,000/- లాభం వస్తుంది. గొర్రె పెంట అమ్మకం ద్వారా రూ. 1,200/- వస్తుంది. వీటితో ఆమె 7 సంవత్సరాలలో అప్పు తీర్చుకోగలిగింది. పళని అమ్మాళ్ చాలా కష్టపడవలసి ఉంటుంది - ఆమె ప్రతిరోజూ 3 కి.మీ. నడుచుకుంటూ వెళ్లి పంపు నుండి నీటిని మోసుకొని రావాలి. అప్పటికి ఉన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆమె తన గొర్రెలను మేపడానికి సజ్జ గడ్డి కూడా కొనవలసి వచ్చేది. కానీ పశువైద్యానికి సంబంధించి అన్నీ ఉచితంగానే లభించేవి.

ఆమె గొర్రెలకు క్రమం తప్పకుండా నులిపురుగుల మందు వేయగలిగేది. పళని అమ్మాళ్‌కు తన మంద గురించి కానీ, తన భవిష్యత్తును గురించికానీ దిగులు లేదు. పెళ్ళైన తన కూతుర్లూ, మనవలూ తన వద్దకు వచ్చినప్పుడు వారికి తాను బహుమతులు కొనగలుగుతున్నందుకు ఆమె చాలా గర్వపడుతుంది. అంతేకాక, ఆమె తన గొర్రెలను అమ్మి ఒక కూతురికి ఆర్థికంగా కూడా సహాయపడింది. అలా అమ్మి ఉండకపోతే ఆమె మందలోని గొర్రెల సంఖ్య 40కి చేరుకునిఉండేది. వృద్ధాప్యంలో ఆమె ఈ మందను కాచుకోలేని పరిస్థితి వస్తే అప్పుడు ఆ



మెచేరి జాతి పశువులకు స్థానికంగా లభించే గడ్డి మైదానాల నుంచే సరైన మేతను అందించవచ్చును.

గొర్రెలను అమ్మివేసి, ఎవరైనా నమ్మకస్తులకు ఆడబ్బును వడ్డీకి ఇచ్చి, ఆ వచ్చే డబ్బులపై బతకాలన్నది ఆమె ఆలోచన.

## కంగయం జాతి ఎద్దుల పెంపకం

కంగయం జాతి ఎద్దులు పశ్చిమ తమిళనాడులో ప్రశస్తిగాంచిన ఎద్దులు. కోరంగాడు పచ్చిక బయళ్ళలో ఇవి ప్రముఖపాత్ర వహిస్తాయి. బలిష్టమైన ఈ జాతి ఎద్దులను గతంలో నీరు తోడడానికి, భూమిదున్నడానికి, ఫలసాయాన్ని మోసుకురావడానికి, బళ్ళులాగడానికి వినియోగించేవారు. అయితే నీటి పారుదల, విద్యుత్ పంపులు, డీజల్ పంపులు అందుబాటులోకి రావడంతోను, ఆస్తుల ధరలు పెరగడంతోను వీటి సంఖ్య చాలా వరకు తగ్గిపోయింది.

అయితే ములను గ్రామానికి చెందిన సుందరం రామస్వామి, అతని భార్య సాంద్ర, బ్రీడింగ్ (వంశవృద్ధి) కొరకు కంగయం ఎద్దులను పోషిస్తున్నారు. వారి నాలుగు ఎద్దులను రోజుకు ఆరు ఆవులను దాటించడానికి వినియోగిస్తున్నారు. తడవకు రూ. 150/- రుసుముగా లభిస్తుంది. చిత్రంగా వీటిలో హోల్స్టీన్ ఫ్రిసియన్ జాతి ఆవులే ఎక్కువగా ఉంటాయి.

ఈ జాతి ఆవులు కృత్రిమ వీర్యదానం ద్వారా అంత సులభంగా గర్భందాల్చవు. ఈ ఎద్దులను పోషించాలన్న ఆలోచన రావడమే కాక, సాంద్రవాటి ఆలనా, పాలన కూడా చూస్తుంది. వాటికి నీరు అందించడం, అవి వీర్యదానం చేసిన వివరాలను రికార్డులో రాసి ఉంచడం వంటివి కూడా ఆమె చేస్తుంది. వారి పోషణలో ఉన్న వృద్ధ ఎద్దు కేవలం సాంద్ర మాట మాత్రమే వింటుందని ఆమె భర్త అంటారు. ఈ జంటకి, ఆ ఎద్దుతో అనుబంధం ఏర్పడింది. వీరు తనపై అరిస్తే ఆ ఎద్దు కంట నీరు పెట్టుకుంటుంది. సాధారణంగా ఆ వయసు వచ్చిన ఎద్దులను రైతులు వదిలించుకుంటారు. కానీ వీరు మాత్రం ఆ ఎద్దును సహజంగానే మరణించనివ్వాలని అనుకుంటున్నారు. అంతేకాదు దానిని పద్ధతిగా పాతి పెట్టాలని కూడా అనుకుంటున్నారు.

## మలబారీ మేకలతో బిను

కేరళలో ఎక్కువగా కనిపించేది మలబారీ జాతి మేకలు. సుగంధద్రవ్యాల సాగుకు ప్రసిద్ధిగాంచిన తేమ, వేడి అధికంగా గల మలబార్ కోస్తా ప్రాంతం బట్టి ఈ జాతి మేకలకు ఆ పేరు వచ్చింది. ఈ జాతి మేకలు చాలా వేగంగా పెరుగుతాయి. సంతానోత్పత్తి కూడా అధికం. పాలు, మాంసం దిగుబడి కూడా ఎక్కువ. ఈ జాతి మేకలు విదేశీజాతులైన బోయర్ మేకలు, వాటి సంకరజాతుల కన్నా మేలైనవని ఎన్నో అధ్యయనాలలో తేలినా ప్రభుత్వం విదేశీజాతులనే ప్రోత్సహించడం జరుగుతోంది.

కానీ కొట్టాయంలోని అతిరంపురకు చెందిన బిను అనే పేద మహిళ మాత్రం ఈ జాతి మేకలవలన ప్రయోజనం



మలబారీ మేకలు పేద ప్రజలకు చాలా విలువైన ఆస్తిగా ఉపయోగపడతాయి.

పొందుతోంది. ఆమె కేవలం ఒక్క ఆడమేకను మాత్రం పెంచుతూ ఉండేది. ఆ మేకకు నాలుగు ఆరోగ్యకరమైన మేక పిల్లలు పుట్టాయి. నాలుగు నెలల ఆడమేక వెల రూ. 1500/-. మగ మేకలు రూ. 2,500/-కు అమ్ముడు పోతాయి. బిను ఈ మేకలను రోడ్డు వెంబడి, తోటలలో ఉచితంగా లభించే గ్రాసంతోనే పెంచుతుంది. మేకల షెట్టు కూడా ఏ ఖర్చూ లేకుండా వృధాగా మిగిలిపోయిన వాటితోనే నిర్మించింది. తాను సంపాదించిన డబ్బును బిను ఇంటి మరమ్మత్తులకి, పిల్లలకి బంగారం కొనడానికి ఉపయోగిస్తుంది. ఆమె రోజువారీ ఖర్చులకు కూలిపని మీద ఆధారపడుతుంది. మలబారీ మేక అదనపు ఆదాయాన్ని సమకూర్చడానికి ఉపయోగపడుతుంది, అదీ ఎటువంటి నష్టమూ లేకుండా.

## అంకమలి పందులతో షిర్లీ

కేరళ ప్రభుత్వం తెల్లసీమపందుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ నిరుపేద రైతులకు ఆదాయాన్ని సమకూర్చి పెట్టడానికి తగినవి స్థానికంగా ఉండే నల్లటి అంకామలీ జాతి పందులే. ఈ జాతి పందుల వలన లాభాలు : ఇవి చిన్నవిగా ఉంటాయి. మాంసం బరువు ఇరవై కిలోలు మాత్రమే. స్థానికంగా లభించే పదార్థాలు తిని బతుకుతాయి, వ్యాధులను, వేడిని తట్టుకుంటాయి, అంతేకాక వీటి పునరుత్పత్తి కూడా సులభంగా జరుగుతుంది. కేరళలోని కొట్టాయం జిల్లాకు చెందిన ఒనంతురుత్తులో తన ఇద్దరు కూతుర్లతో నివసిస్తున్న షిర్లీ రెండు ఆడపందులను, ఒక మగపందిని వంటింటి వ్యర్థాలతో, పచ్చికులతో, కలుపు మొక్కలతో పెంచుతోంది. ఈ మధ్యనే ఆమె 45 రోజుల వయసున్న పంది పిల్లలను ఒక్కొక్కటి రూ. 1000/- చొప్పున అమ్మింది. ఆమె కొన్ని మేకలను కూడా పెంచుతోంది. ఒక వేచూర్ జాతి ఆవును కొనాలని షిర్లీ ఆశపడుతోంది.

## వేచుర్ ఆవులు

వేచుర్ ఆవులు కేవలం 90 సెం.మీ. ఎత్తు ఉంటాయి. ఇవి కేరళా దక్షిణకోస్తా ప్రాంతానికి చెందినవి. సంకరజాతి పశువులను విరివిగా ప్రోత్సహించడంలో ఇవి కనుమరుగైపోయేవే. కానీ ప్రొసోసమ్మ ఐపే మరియు ఆమె విద్యార్థులు (తరువాత వీరు వేచుర్ కన్సర్వేషన్ ట్రస్టుగా ఏర్పడ్డారు). మిగిలిన అసలైన వేచుర్ ఆవులను కొన్నింటికి కాపాడారు. ఇప్పుడవాటి సంఖ్య 1500కు చేరుకుంది. ఇప్పుడు ఈ జాతి ఆవు అందరినీ ఆకర్షిస్తోంది. తక్కువ పెట్టుబడి వ్యవసాయంలో ఈ జాతి ఆవులు చోటు చేసుకుంటున్నాయి. వీటికి తక్కువ స్థలం సరిపోతుంది. పంటవ్యర్థాలతోను, కలుపు మొక్కలతోనూ పోషించవచ్చు. ఈ ఆవు పెంపుడు జంతువుగా కూడా పనికివస్తుంది. చిన్న పిల్లలున్న ఇళ్ళలో కూడా పాలకోసం ఈ ఆవును పెంచుకుంటారు. కొట్టాయం జిల్లాకు చెందిన వేచుర్ గ్రామం సమీపంలోని మూజికులంగరలోని వేచుర్ ఫారంలో ఈ జాతి ఆవుకు పెద్ద వెయిటింగ్ లిస్ట్ (ఈ ఆవు కావలసిన వారి జాబితా) ఉంది.

## ముగింపు

ఇప్పుడు ప్రోత్సహింపబడుతున్న మేలు జాతి పశువులకన్నా స్థానిక జాతులు ఎన్నో విధాలమేలైనవి. స్థానిక జాతులు వ్యాధులను తట్టుకుంటాయి. ఎక్కువ సంతానాన్ని ఇస్తాయి. పెంపకం విషయంలో తప్పు జరిగే అవకాశం తక్కువ. వీటి పెంపకానికి, అంటే నివాసానికి, పశుగ్రాసం, దాణా కొనుగోలుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. నిజానికి వీటి పెంపకానికి కావలసినవి చాలా వరకూ ఉచితంగా లభిస్తాయి. అందువలన స్త్రీలకు వారి ఖాళీ సమయాలలో ఎటువంటి బాదరబందీ లేకుండా నికరమైన ఆదాయాన్ని సమకూర్చి పెట్టేది ఈ స్థానిక జాతి పవువుల పెంపకమే. ఈ పని వారు ఇతరత్రా పనులు చేసుకుంటూ కూడా కొనసాగించవచ్చు. రెండు రకాల జాతులను పోల్చి చూస్తే మేలు జాతి పశువులు అధిక దిగుబడి ఇవ్వచ్చుగాక. కానీ వాటి సంరక్షణకు సరైన వసతి ఏర్పాటు, వ్యాధులనుండి కాపాడడానికి క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించడం, సాంద్రదాణాల కొనుగోలు వంటివి ఎన్నో అవసరం అవుతాయి. ఈరకం జాతి పశువులలో తరచూ సంతానోత్పత్తి సమస్యగా ఉండి కొన్నేళ్ళకు దిగుబడులు ఆశించిన మేరకు ఉండవు. ఉదాహరణకు, కేరళలో సంకరజాతి పశువులను ప్రవేశపెట్టి అరశతాబ్దం దాటినా, సగటు సంకరజాతి పశువుల పాల దిగుబడి రోజుకి 6.5 కిలోలే ఉంది. వీటి సంఖ్య కూడా నానాటికీ తగ్గిపోతోంది. స్థానిక రైతులు వీటిని ప్రవర్ధనం చేయడం మానుకుని చూడి కట్టిన పశువులనే కొని, పాల ఉత్పత్తి ఆగిపోయాక పశువులను కబేళాలకు అమ్మివేస్తున్నారు. సాధారణంగా ఎవరూ పదేళ్లకు మించి పశుపోషణ చేపట్టడం లేదని పశుజన్య శాస్త్రవిశ్రాంత ప్రొఫెసర్ మరియు వేచుర్ కన్సర్వేషన్ ట్రస్టు అధిపతి డా. సోసమ్మ ఐపే అంటారు. స్థానిక జాతుల వలన ఇన్ని లాభాలు, సంకర జాతి పశువుల వలన ఇన్ని నష్టాలూ ఉన్నప్పటికీ, నాబార్డ్ వంటి పరపతి సంస్థలు సంకరజాతి పశువుల కొనుగోలుకు మాత్రమే రుణాలు ఇస్తున్నాయి. పశు సంవర్ధక శాఖలు కూడా సంకరజాతి పశువులనే పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాయి. ఇంక ఈ పద్ధతి మారవలసిన సమయం వచ్చింది! ◆

**Captions :**

Mecheri Sheep are adaptable to the local pasture systems.

స్థానిక పరిస్థితులకు అనువైన మెచేరి గొర్రెలు

Malabari goasts, a means of building assets.

ఆస్తులు పెంచుకునే మార్గం, మలబారి మేకలు

Kangayam stud bulls are being used for breeding.

ప్రవర్ధనానికి ఉపయోగపడుతున్న కంగయం ఎద్దులు

Vechur cattle ideal for low input farming.

తక్కువ పెట్టుబడి సేద్యానికి అనువైన వేచుర్ పశువులు



Kannada, Telugu, Tamil, Oriya, Hindi, Marathi, Punjabi

# చిరుధాన్యాలు - ఓ పారిశ్రామికుడు

## అమిత్ చక్రవర్తి

**వినియోగదారుల్లో చైతన్యం లేకపోవడం, సరైన గిరాకీ లోపించడం, వాటి విలువలను తెలియజేసే ప్రచార ఆర్భాటాలు కొరతగా ఉండడం, పరిశోధక శాస్త్రవేత్తలు, వాణిజ్య ప్రముఖుల ఉదాశీనత... ప్రస్తుతం చిరుధాన్యాలకు ఎదురవుతున్న పెను సమస్యలుగా చెప్పాలి. చిరుధాన్యాలలో ఉన్న పోషక విలువల సంపద తెలిసిన వారికి ఎవరికైనా ఈ రకమైన నిరాసక్తి ధోరణి ఆశ్చర్యం కలిగించకమానదు. చిరుధాన్యాల రైతులకు ఇది ఒక పెద్ద సవాలు కాగా, వాతావరణ మార్పుల ప్రభావం వల్ల ఎదురయ్యే సమస్యలను ఇలాంటి ధోరణి మరింత నష్టదాయకంగా మార్చివేస్తున్నది. నిజానికి పర్యావరణపరంగా చిరుధాన్యాల సాగు చాలా ప్రయోజనకరం. ముఖ్యంగా వీటి సాగుకు ఎక్కువ నీరు అవసరం ఉండదు. బయటి నుంచి తెప్పించుకోవల్సిన ఇన్‌పుట్‌ల భారం అంతగా ఉండదు. అయితే ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు రైతు సోదరులు ఏటికి ఎదురీదేందుకు సిద్ధమవుతున్నారు.**

అలా పంట పొలాల మధ్య నడుస్తుండగా ఆ పక్కనే నిర్మాణంలో ఉన్న షెడ్డు ఒకటి ఆకట్టుకుంటుంది. ఆ షెడ్డు యజమాని వీర శెట్టి తన భవిష్యత్తు కార్యక్రమాలను ఇలా వివరించాడు. - చిరుధాన్యాలు, మొక్కజొన్న సేద్యంలో సంప్రదాయక పద్ధతులనే అనుసరిస్తూ ఈ పరిసర గ్రామాలలో కనీసం వంద మందికి ఉపాధి కల్పించాలనుకుంటున్నాను. వాళ్లను తిరిగి వ్యవసాయం వైపు తీసుకురావాలని ఆశిస్తున్నాను. -

అది తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా గంగాపూర్ గ్రామం. అక్కడే శెట్టిని కలిశాం. సామాన్య రైతు స్థాయినుంచి ఒక పరిశ్రమకు అధిపతిగా సొంతంగా ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు



రకరకాలైన చిరుధాన్యాల దిగుబడుల ప్రదర్శన

చేసుకున్నారాయన. ఆయన ప్లాంట్‌లో తయారైన ఆహార పదార్థాలు తినడానికి అనువుగా సిద్ధం చేయబడనున్నాయి. వచ్చే మూడు నాలుగు నెలల్లో అది పూర్తి స్థాయిలో వినియోగానికి సిద్ధం కానున్నది. ఆయన దీనికి అనుబంధంగా షాపును, దానికి ఆనుకుని రెస్టారెంట్‌ను కూడా సిద్ధం చేశారు. ఎస్ఎస్ భవానీ ఫుడ్స్ పేరుతో హైదరాబాద్‌లో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన విక్రయిస్తున్నాడు. వాటిలో సజ్జలతో, జొన్నలతో చేసిన రొటీలు, చిరుధాన్యాలతో చేసిన లడ్డూలు, పూర్ణంపోలి, చిరుధాన్యాల మాల్ట్ వంటివి ముఖ్యమైనవి. రోజుకూ 200-400 మంది వరకు కస్టమర్లు వస్తూ ఉంటారు. పట్టణ ప్రాంత వినియోగదారులకు ఆరోగ్యం అందించే పుష్టికరమైన ఆహారం అలవాటు చేయాలనేది ఆయన సంకల్పం. అందుకు ముందుగా రైతులు చిరుధాన్యాల సాగును విస్తరించాలని అందుకు తగినట్టు ప్రోత్సహించాలని ఆయన కంకణం కట్టుకున్నారు.

ముగ్గురు కుమారుల్లో పెద్దవాడైన శెట్టి పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆ తరువాత కుటుంబ భారం మోయడం కోసం సంపాదన వేటలో పడ్డాడు. ముందుగా డ్రైవరు ఉద్యోగం దొరికింది. 2005లో ఆయన దృష్టి తెల్ల జొన్న సేద్యంపై పడింది. 2007లో హైదరాబాద్‌లో ఒక చిన్న దుకాణం ప్రారంభించి జొన్న రొట్టెలను విక్రయించేవాడు. అప్పట్లో ఈ తెల్ల జొన్న, లేదా చిరుధాన్యాల ప్రయోజనాలపై అక్కడి పట్టణ వాసులకు అంతగా అవగాహన లేదు. అందువల్ల ఆయన చేపట్టిన ఆ ప్రయత్నం విఫలమైంది. అయితే పట్టు విడవకుండా మరో చోట కొత్తగా దుకాణం ప్రారంభించాడు. అక్కడ కస్టమర్ల సంఖ్య కాస్త పెరిగింది. వారిలో ఎక్కువ మంది మధుమేహ రోగులే. తరువాతి కాలంలో ఆయన ఎస్ఎస్ భవానీ ఫుడ్స్ వ్యాపారం ప్రారంభించి పెద్ద ఎత్తున కార్యకలాపాలు చేపట్టాడు. అందుకోసం ఒక పరిశ్రమ స్థాయిలో వంటశాల ఏర్పాటు చేశాడు. దానికి అనుబంధంగా రెస్టారెంట్ నెలకొల్పాడు. అక్కడ చిరుధాన్యాలతో తయారుచేసిన భోజనం అందించారు. దాంతో పాటు ప్రజలకు చిరుధాన్యాలలోని పోషక విలువలను పరిచయం చేసేందుకు గోడలపై పోస్టర్ల రూపంలో ప్రచారం ప్రారంభించాడు.

ఈ ప్రయత్నంలో ఆయన రొటీ తయారుచేసేందుకు ఒక యంత్రం తయారుచేసుకోగలిగాడు. దానిని బెంగళూరులో తయారు చేయించాడు. దాని సహాయంతో గంట సేపట్లో 500 రొటీలు సిద్ధం చేయవచ్చు. తన విక్రయ కేంద్రం నుంచి రోజుకు 2000 నుంచి 3000 రొటీలు సరఫరా అవుతుంటాయి. ఇక్కడ ఆరు నెలల పాటు నిల్వ ఉంచడానికి అనువైన ఎండు రొట్టెలు



చిరుధాన్యాలతో తయారుచేసిన రోటీలను ఒడిశా ప్రజలకు ప్రదర్శిస్తున్న దృశ్యం

కూడా తయారు చేస్తారు. వాటిని ఆస్ట్రేలియాకు ఎగుమతి చేస్తారు. పూర్ణంపోలి దుబాయ్‌కి ఎగుమతి అవుతుంది. ప్రతి నెలా ఆయన 2000 రోటీలు, 300 నుండి 400 పూర్ణం పోలిలు ఎగుమతి అవుతుంటాయి.

2016లో ఆయన స్వయంశక్తి అగ్రి ఫౌండేషన్ ప్రారంభించాడు. చిరుధాన్యాల రైతులతో కలిసి పనిచేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. రైతులకు అవసరమైన ముడి సరుకులను ఈ ఫౌండేషన్ ద్వారా శెట్టి సమకూరుస్తాడు. అధికోత్పత్తి సాధనకు అనుసరించ వలసిన ఉత్తమ సేద్య విధానాలపై వారికి శిక్షణ ఇస్తాడు. అక్కడితో ఆగకుండా వారి పంటను ఆయనే కొనుగోలు చేస్తాడు. ఈ లావాదేవీల్లో రైతులకు ప్రీమియం ధరలనే ఆయన చెల్లిస్తాడు. ఈ ఫౌండేషన్‌కు ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చి ఫౌండేషన్ (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్) సహకారం అందిస్తున్నది. ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ సంస్థకు కోరాపుట్ జిల్లాలోని 500మంది రైతులతో కలిసి పనిచేస్తోంది. ముఖ్యంగా చిరుధాన్యాల ఆధారంగా తయారు చేసిన లడ్డులు, సేమ్యా, అటుకులు (చివ్డా) రోటీలు గురించి ప్రచారం చేసేందుకు కృషి చేస్తోంది. సేద్యంలో చీడపీడల నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలను వివరిస్తున్నది. వర్షపునీటిని పొదుపుగా వాడుకునే మార్గాలను తెలియజేస్తోంది. వర్మికం పోస్టు తయారీ విధానాలపై శిక్షణ ఇస్తున్నది. ఏరోబిక్ కంపోస్టు, భూసార రక్షణకు కావలసిన సేంద్రీయ పదార్థాల తయారు విధానాలు పరిచయం చేస్తున్నది. విత్తనాలను నాటడంలో కూడా శిక్షణ ఇస్తోంది.

> చిరుధాన్యాల ఆధారిత బువ్వను అందించడమే కాకుండా ఆయన ఏర్పాటు చేసిన రెస్టారెంట్ గోడలపై పోస్టర్ల రూపంలో చిరుధాన్యాలలో లభించే పోషక విలువల ప్రచార సమాచారం కూడా కనిపిస్తూ ఉంటుంది.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చి సహకారంతో మరో ప్రాజెక్టును కూడా శెట్టి చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని 8 గ్రామాలలోని 1000 మంది రైతులను ఆయన ఏకతాటిపైకి తీసుకువచ్చి వారికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సాధారణంగా రైతు ఇబ్బందుల్లో ఒకటి విత్తనాలు సంపాదించడం. కిలో విత్తనాల కోసం పట్టణం బాట పట్టాల్సి ఉంటుంది. తీరా అక్కడికి వెడితే విత్తనాల నాణ్యత గురించి ఏమీ తెలియదు. ఈ సమస్య పరిష్కారం కోసం విత్తనాలను మేం రైతు ఇంటి ముందుకు తీసుకెళ్లి అందిస్తాం. ఏ సీజన్‌లో ఏ పంట సాగుచేస్తే మంచి ఫలితాలు ఉంటాయో సూచనలు చేస్తాం. ఈ సూచనలు అందించేప్పుడు మార్కెట్ ధరవరలు, సరుకుల లభ్యత వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటాం. ఇక రైతన్నలు పండించిన పంటను సరసమైన ధరలకే కొనుగోలు చేసిన తరువాత, దాణాని ఆహార పదార్థాలుగా వినియోగించేం దుకు, వాటి ద్వారా వసారా వంటి ద్రవాహారం సిద్ధం చేయడానికి వీలుగా గ్రేడుల వారీగా వేరు చేస్తారు. మానవ వినియోగానికి అనువైన భాగాన్ని వేరు చేసి భద్రపరుస్తారు. మిగిలిన భాగాన్ని ఆయన విత్తన కంపెనీలకు, పశు దాణా విక్రేతలకు, డిస్టిలరీలకు సరఫరా చేస్తారు. వీటి నుంచి ఎథనాల్ తయారు చేయవచ్చు.

చిరుధాన్యాలలో ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉన్న పోషక విలువల గురించి ఆయన ఇలా వివరించారు. - మా కస్టమర్లలో 60శాతం మంది ఐటీ పరిశ్రమకు చెందిన యువతరమే. ఈ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోని వారికి వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ అని గుర్తించాం. ముఖ్యంగా ఊబశరీరం, మధుమేహం వంటి వాటికి గురి అవుతుంటారు. మిగిలిన కస్టమర్లు మధ్య వయస్కులు. లేదా పెద్ద వయసులోని వారు. వీళ్లంతా ఏదో ఒక రకమైన ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూనే ఉంటారు. ఇక కొద్ది మంది ఆరోగ్యం గురించిన ముందస్తు అవగాహనతో




వివిధ ఆహార పదార్థాలను వివరిస్తున్న దృశ్యం

వస్తారు. జీవనశైలిలో వస్తున్న మార్పులు కారణంగా వైద్యులు తమ వద్దకు వచ్చే వారికి చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

అయితే గిట్టుబాటు ధరలు రాకపోవడం వల్ల చాలా మంది రైతులు వీటికేసి దృష్టి సారించడం లేదంటారు శెట్టి. పట్టణ ప్రాంతాల వారిలో చిరుధాన్యాల వాడకంపై విస్తృతంగా ప్రచారం చేస్తే గిరాకీ పెరుగుతుంది. అది రైతులను వాటి సాగు వైపు మళ్లించడానికి తోడ్పడుతుంది అంటారు శెట్టి.

ఈ విషయంలో ప్రభుత్వం కూడా ఎంతైనా కృషి చేయవచ్చు. సెక్రెటేరియట్ వంటి ప్రభుత్వ కార్యాలయాలలోని క్యాంటీన్‌లలోనూ, గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించే హాస్టళ్లలోనూ, జవహర్ నవోదయ రెసిడెన్షియల్ స్కూళ్లలోనూ, సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహించే స్కూళ్లలోనూ చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు అందించాలి. ఈ విధానాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. మధ్యాహ్న భోజనంలో కూడా చిరుధాన్యాలను ఒక భాగంగా అమలుచేయాలి. ఈ తరహా ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను, విక్రయ కేంద్రాలను ఒక పరిశ్రమగా పట్టణాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహం ఇవ్వాలి. తమిళనాడు, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ప్రజలకు చౌక ధరలకే వరి అన్నం, సాంబారు అందిస్తున్నాయి. ఇక్కడ వరి అన్నం స్థానంలో చిరుధాన్యాలకు చోటు కల్పించాలి అంటున్నారు శెట్టి. అంతే కాకుండా చిరుధాన్యాల సాగును చేపట్టేందుకు రైతులను ప్రోత్సహించాలి. ఇందుకు ప్రతి రైతు తనకున్న పొలంలో కనీసం 10వ వంతు కేటాయించేలా చూడాలి. ఇతర పంటలను కూడా సాగుచేయవచ్చు. అలాగే ఆహార పదార్థాలను తయారుచేసే రంగంలో ఉన్న పరిశ్రమలను కూడా ఆకట్టుకునేందుకు వారికి కొంత వరకు పన్ను రాయితీలు ఇవ్వటం మంచిది. వారిని క్యాంటీన్లకు, హాస్టళ్లకు ఈ చిరుధాన్యాల ఆహార పదార్థాలను సరఫరా చేసేందుకు ఒప్పించాలి.

ప్రజలు చిరుధాన్యాలను ఉపయోగించేందుకు సిద్ధంగానే ఉన్నారు. కానీ అవి వారికి అందుబాటులోనికి రావటం లేదు అంటారాయన. ఇక గంగాపూర్‌లోని ఆయన సొంత ప్రాసెసింగ్ యూనిట్ విషయానికి వస్తే ఆయనకు ఉన్న ఒక పెద్ద కలలో అది ఒక భాగం మాత్రమే. ఒక గోడౌన్, రైతు శిక్షణ కేంద్రం, డెమో ప్లాట్స్, సేంద్రీయ సేద్యం, ఇంకా ఎన్నో ఎన్నో ఆయన మదిలో ఉన్నాయి. ఈ యూనిట్ నుంచి పట్టణ వాసులకు అనువైన ఆహారం అందించాలనుకుంటున్నారు. విదేశాలకు కూడా ఎగుమతి చేయాలనుకుంటున్నారు. ఆరోగ్యం విషయంలో అవగాహన ఉన్న ప్రపంచ వ్యాప్త వినియోగదారులకు చేరువ కావాలనేది నా ఆశయం. అది తోటి రైతన్నలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుంది అంటున్నారు శెట్టి. ◆

**Amit Chakravarty**
Chief of Staff to the Director General
ICRISAT, Patancheru 502324, Telangana, India
E-mail : a.chakravarty@cgiar.org

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 19, సంచిక 1, డిశంబర్ 2017.